

TGTEL/25/A1713

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 70 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 23 అక్టోబర్ 2026 | వెల : 4/-

# డిండికి నీటి తరలింపు ఆపండి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి
- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ



హైదరాబాద్

డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు. సుమారు గంటన్నర పాటు - మిగతా3లో



## 2030 నాటికీ కాంగ్రెస్ గెలవలేదు

- కేజ్రీవాల్‌కు పంజాబ్‌లో పతనం తప్పదు
- దేశంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రతికూల రాజకీయాల కారణంగా ఆ పార్టీ 2030 నాటికీ ఎన్నికల్లో విజయం సాధించదు
- త్వరలో పంజాబ్‌లో జరిగే ఎన్నికల్లో ఆప్‌ప్రభుత్వాన్ని ప్రజలు తగిన సమాధానం ఇస్తారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

## బీసీలకు న్యాయం చేయడమే
# ప్రభుత్వ లక్ష్యం

- పండుగ సాయన్న పోరాటం ఎందరికో ఆదర్శం
- ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటు
- ముదిరాజ్ బిడ్డలకు మరిన్ని రాజకీయ అవకాశాలు..
- కులగణనతో దేశానికి ఆదర్శంగా నిలిచాం
- ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయానికి ముందడుగు
- 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ
- ముదిరాజ్‌లకు సంపూర్ణ న్యాయం చేస్తాం
- పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటాలి



హైదరాబాద్

భూస్వాములు, జమిందార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, పేదల పక్షాన నిలిచిన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. తన పోరాటంతో ఎందరికో ఆదర్శంగా నిలిచిన పండుగ సాయన్నకు చరిత్రలో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. పండుగ సాయన్న తన కాలంలో దొరలు, భూస్వాములు ఆక్రమించిన భూములను పేదలకు దక్కేలా పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాజంలోని - మిగతా3లో

## మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకోవడం గర్వంగా ఉంది

- ప్రధాని నరేంద్ర మోదీపై పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ ప్రసంశల జల్లు
- ఆయన తన స్నేహితుడని చెప్పుకోడవం గర్వంగా ఉందని తెలిపారు.
- వాణిజ్యం, రక్షణ, సాంకేతికత సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా ఇరువురు నేతలు చర్చలు
- భారత్ వంటి శక్తివంతమైన దేశానికి నాయకత్వం వహిస్తున్న మోదీని నా స్నేహితుడిగా పిలుచకోవడం గర్వకారణం





## ఈ పాపంలో ఎందుకు భాగమయ్యారు

- విరాళాల చోరీపై మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ ఆరోపణలు
- రామాలయ విరాళాల చోరీ జరిగి ఇన్ని రోజులు గడిచినా ఆ విషయంపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు
- కోట్ల మందినుంచి సేకరించిన వేలకోట్ల రూపాయల విరాళాలు లూటీ అయ్యాయి
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్
- విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు



## మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి

- తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం
- తమిళనాడులో మంత్రులు, ఎమ్మెల్యేల అధికారిక వాహనాలపై ధరల పరిమితి
- మంత్రులకు రూ. 26 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షలుగా గరిష్ఠ ధర
- పదవి కోల్పోతే వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలన్న నిబంధన
- ప్రభుత్వ ఈ–మార్కెట్‌ప్లేస్ పోర్టల్ ద్వారానే కొనుగోలు చేయాలన్న ప్రభుత్వం
- ఏటా వాహనాల కొనుగోలు ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు అవకాశం

## టీడీఆర్ లావాదేవీల్లో మోసాలకు చెక్

- టీడీఆర్ పోర్టల్‌లో ఆధార్ అథెంటికేషన్..
- టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ వినియోగానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం
- మోసాలు, డూప్లికేట్ రిజిస్ట్రేషన్ల నివారణే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లకు వర్తించనున్న కొత్త విధానం
- ఆధార్ వినియోగం స్వచ్ఛందం, ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలకు అనుమతి




హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ప్రక్రియను మరింత పారదర్శకంగా, సురక్షితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ ఆధారిత అథెంటికేషన్ సదుపాయాన్ని ప్రవేశపెడుతూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లావాదేవీల్లో మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, అనధికారిక లాగిన్‌లను అరికట్టడంతో పాటు రికార్డుల కచ్చితత్వాన్ని పెంచడం ఈ విధానం ప్రధాన లక్ష్యం. కొత్త విధానం - మిగతా3లో



## మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

- ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం
- ప్రధాని మోదీతో ఫోన్‌లో ఇజ్రాయెల్ ప్రధాని మాట్లాడారు
- కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి స్వాతంత్ర్య వేడుకల్లో జ్యోతిని వెలిగించాలని కోరారు.

## వరంగల్ కోట అభివృద్ధికి
# గ్రీన్ సిగ్నల్

- రూ.382 కోట్లు మంజూరు
- కాకతీయ వైభవానికి కొత్త శోభ..
- చారిత్రక కట్టడాల పరిరక్షణకు భారీ ప్రణాళిక
- ఖిల్లా వరంగల్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు
- సెంట్రల్ ప్లాజా, బస్ టెర్మినల్ నిర్మాణం
- వేయి స్తంభాల ఆలయ పరిసరాల అభివృద్ధి
- కుడా పర్యవేక్షణలో పనులు.. ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రాజెక్టుల అమలు



వరంగల్:

తెలంగాణ చారిత్రక వైభవానికి, కాకతీయుల అద్భుత నిర్మాణ శైలికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, నగరంలో ఆధునిక మౌలిక సదుపాయాలను కల్పించడం లక్ష్యంగా రూ.382 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో వివిధ ప్రాజెక్టులను చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వరంగల్ నగర అభివృద్ధిపై మరోసారి ఆశలు చిగురించాయి. కాకతీయ రాజుల పాలనలో రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్య కేంద్రంగా విరాజిల్లిన ఓరుగల్లు నగరానికి చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. కాకతీయుల కళా వైభవాన్ని ప్రతిబింబించే కోటలు, ఆలయాలు, శిల్ప సంపద నేటికీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. - మిగతా3లో

## ఆర్థిక సంక్షోభంలో అండగా నిలిచారు

- భారత్‌కు శ్రీలంక మంత్రి ధన్యవాదాలు
- ఆర్థిక సంక్షోభంలో ఆదుకున్న భారత్‌కు శ్రీలంక మంత్రి కృతజ్ఞతలు
- 2022 నాటి కష్టాల నుంచి పూర్తిగా బయటపడ్డామని వెల్లడి
- భవిష్యత్తులో రుణాల చెల్లింపుపై ఎలాంటి రిస్క్ లేదని ధీమా
- వృద్ధి కోసం 1990ల నాటి భారత సంస్కరణలను ఆదర్శంగా తీసుకుంటామని ప్రకటన
- నిలిచిపోయిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను తిరిగి ప్రారంభిస్తున్నామని వెల్లడి



# ఈ పాపంలో ఎందుకు భాగమయ్యారు



రామమందిర విరాళాల చోరీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. 'బీజేపీ, ఆరెఎస్ఎస్, వీహెచ్‌పీ కాసప్నా, చందే కా మాల్ అప్నా' (విరాళాల నిధులను తమ సొంత ఆస్తిగా భావించడమే బీజేపీ, ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్‌ల కల) అని ఎద్దేవా చేసింది. ఆలయ విరాళాల చోరీ జరిగి ఇన్ని రోజులు గడిచినా ఈ విషయంపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని, ఈ పాపంలో ఎందుకు భాగస్వాములయ్యారని ప్రశ్నించింది. రామమందిరంలో సమర్పించిన కానుకలు మాత్రమే చోరీకి గురికాలేదని, ఆలయ నిర్మాణం కోసం కోట్ల మందినుంచి సేకరించిన వేల కోట్ల రూపాయల విరాళాలు కూడా లూటీ అయ్యాయని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో ప్రశ్నల వర్షం కురిపించారు. "ప్రతిపక్షాలు పదేపదే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లకు చెందిన వ్యక్తులపై ఆరోపణలు వచ్చినప్పటికీ, వారిపై ఇప్పటివరకూ ఎటువంటి విచారణ జరగలేదు. తప్పు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరోవిషయం ఏమిటంటే, కానుకలు సమర్పించకముందే విరాళాలు చోరీకి గురయ్యాయా? అనేది అసలు ప్రశ్న. ఇక, గతంలో అనుమానస్పదంగా జరిగిన భూములు కొనుగోళ్లపై కూడా ఎలాంటి స్పందన లేదు. 2021 మార్చి 18 సాయంత్రం 7:10 గంటలకు తివారీ, అన్సారీలు కుసుమ్ పాఠక్ అనే వ్యక్తి నుంచి రూ. 2 కోట్లకు భూమిని కొనుగోలు చేశారు. సరిగ్గా ఐదు నిమిషాల తర్వాత, అంటే సాయంత్రం 7:15 గంటలకు, అదే భూమిని ట్రస్టు తరపున చంపత్ రాయ్ రూ. 18.5 కోట్లకు కొనుగోలు చేశారు. ఇది నిజం కాదా కేవలం అయిదు నిమిషాల వ్యవధిలో 825 శాతం ధర పెంచడమనేది స్పష్టమైన దోపిడీ. అసలు ఇది ఎలా సాధ్యమైంది ఈ రెండు రిజిస్ట్రేషన్ పత్రాలకు సాక్షులుగా అప్పటి బీజేపీ మేయర్ రిషికేష్ ఉపాధ్యాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రానే ఉన్నారు.

**'విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు'**

మరోవైపు, రామాలయ విరాళాల చోరీకి సంబంధించి 2021 నాటి విచారణ నివేదికను ఐదేళ్లు గడిచినా ఎందుకు బహిర్గతం చేయలేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ దొంగతనంపై జూన్ 4న రామమందిర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కి వీడియో అందినప్పటికీ, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 21 రోజులు ఎందుకు ఆలస్యం చేశారని అడిగారు. అలాగే భూ లావాదేవీలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) విచారణ ఫలితాలను ఎప్పుడు వెల్లడిస్తారని ఆయన నిలదీశారు.

**'విరాళాలు దొంగిలించేవారిని శిక్షించాల్సిన బాధ్యత దేశ పౌరులపైనే ఉంది'**

అంతకుముందు, ప్రధాని మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై కూడా కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఆలయంలోని కానుకల పూర్తి లెక్కలను బహిరంగపరచాలని, బాధ్యులందరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఏ అధికారిని కూడా జవాబుదారీతనం నుంచి తప్పించకూడదని తెలిపింది. విరాళాలు దొంగిలించేవారిని శిక్షించాల్సిన బాధ్యత దేశ పౌరులపైనే ఉందని పేర్కొంది. రామమందిర విరాళాల చోరీ విచారణలో రామమందిర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి వారికి రక్షణ కల్పిస్తున్నారని కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ ఆరోపించింది. ఈ విషయంపై ప్రధాని మోదీ మౌనం వహించడంపై విమర్శలు గుప్పించింది. విరాళాల చోరీకి సంబంధించి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగే నిష్పక్షపాత, పారదర్శక విచారణ మాత్రమే అసలు నిజాన్ని బయటపెట్టగలదని పేర్కొంది.

# మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకోవడం గర్వంగా ఉంది



భారత్‌తో తమ దేశానికి సానుకూల సంబంధాలు ఉన్నాయని, ఇరు దేశాల మధ్య ప్రయోజనాల సంఘర్షణకు తావులేదని పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ స్పష్టం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీని తన స్నేహితుడిగా చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. గురువారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. వాణిజ్యం, రక్షణ, సాంకేతికత సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు.

"భారత్ వంటి శక్తివంతమైన దేశానికి నాయకత్వం వహిస్తున్న మోదీని నా స్నేహితుడిగా పిలుచుకోవడం గర్వకారణం. గత 35 ఏళ్లలో భారత్, పోలాండ్ దేశాలు అపూర్వమైన ఆర్థిక విజయాన్ని, వేగవంతమైన వృద్ధిని సాధించాయి. భారత్? ప్రగతిని, పోలాండ్ ఆర్థిక పురోగతిని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రాజకీయ అనిశ్చితి, అస్థిరత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ పోషిస్తున్న పాత్ర ఆశాజనంగా ఉంది. ప్రపంచ స్థాయిలో భారత్ ప్రాధాన్యం పెరుగుతుండటం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ఇక ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలనే నిర్ణయం 2024 ఆగస్టులో మోదీ వార్సా పర్యటన సందర్భంగా తీసుకున్నాం. రెండు దేశాల మధ్య ప్రయోజనాల పరంగా విభేదాలు లేవు. చారిత్రకంగా విడదీసే సమస్యలు కూడా పెద్దగా లేవు. పరస్పర విశ్వాసం, ఉమ్మడి విలువలు, శాంతియుత మార్గాలపై నమ్మకమే తమ స్నేహానికి పునాది. పోలాండ్‌లో ప్రజాస్వామ్యం కోసం సాగిన సాలిడారిటీ ఉద్యమం భారత్ అనుసరించిన అహింసా సంప్రదాయమే మాకు స్ఫూర్తినిచ్చింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఈ విలువల సారూప్యత భవిష్యత్తులో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది"

**'యూరప్‌కు భారత్‌కు మధ్య వారధిగా పోలాండ్'**

యూరప్‌తో భారత్ సంబంధాల విస్తరణలో పోలాండ్ కీలక పాత్ర పోషించగలదని టస్క్ పేర్కొన్నారు. యూరప్‌లో, ముఖ్యంగా మధ్య, తూర్పు యూరప్ ప్రాంతంలో పోలాండ్ ఆర్థికంగా ఎదుగుతోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ పరిధిలో ఇరు దేశాల సహకారానికి సంబంధించిన అంశాలపై గతంలో జరిగిన చర్చలు సానుకూల ఫలితాలిచ్చాయని తెలిపారు. ఈ ప్రయత్నాలు భారత్-పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది వేశాయని చెప్పారు. దీని ద్వారా భారత్, పోలాండ్‌తో పాటు యూరప్ కూడా ప్రయోజనం పొందుతుందని అభిప్రాయపడ్డారు. భారత్-పోలాండ్ సంబంధాల చరిత్రలో మార్చి 30వ తేదీకి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు టస్క్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య తొలి చర్చలు, సంబంధాలకు సంబంధించిన వార్షిక సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజును 'భారత్-పోలాండ్ భాగస్వామ్య దినోత్సవం'గా గుర్తించనున్నట్లు తెలిపారు. జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపైనా భారత్, పోలాండ్ పరస్పరం సహకరించుకోవాలని టస్క్ ఆకాంక్షించారు. ఇరు దేశాల ప్రయోజనాలతో పాటు ప్రపంచ సంక్షేమానికి దోహదపడేలా కలిసి పనిచేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఆర్థిక సంబంధాలే కీలకం**

భారత్- పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆర్థిక సంబంధాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని టస్క్ వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాలకు చెందిన కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తన వెంట పోలిష్ కంపెనీలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చారని, ఇరు దేశాల సంబంధాల చరిత్రలో ఇదొక కీలకమైన వ్యాపార పర్యటన అని పేర్కొన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్, నౌకానిర్మాణం వంటి రంగాలతో పాటు అంతరిక్ష పరిశ్రమ, డిజిటలైజేషన్, ఉపగ్రహ సాంకేతికత, ఆధునిక రక్షణ వ్యవస్థల్లో ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వివరించారు. రక్షణ రంగంలో సాంకేతిక సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని టస్క్ అన్నారు. ముఖ్యంగా డ్రోన్లు, ఉపగ్రహాల అభివృద్ధి, వినియోగంలో ఇరు దేశాలు కలిసి పనిచేయవచ్చని తెలిపారు. ఇటీవలి పరిణామాల్లో తమ దేశ డ్రోన్లు ఉపయోగకరంగా నిలిచాయని పేర్కొంటూ, రాజకీయ ఉద్రిక్తతలు, సంక్షోభ సమయాల్లో ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

# 2030 నాటికీ కాంగ్రెస్ గెలవలేదు



కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. దేశంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రతికూల రాజకీయాల కారణంగా ఆ పార్టీ 2030 నాటికి కూడా ఎన్నికల్లో విజయం సాధించదని పేర్కొన్నారు. చొరబాటుదారులను కాపాడటానికే ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. వచ్చే ఏడాది పంజాబ్‌లో జరిగే ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. పంజాబ్ నుంచి ఆప్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తారని హెచ్చరించారు. యమునా నదిని శుభ్రపరిచేందుకు చేపట్టిన రూ. 8,941 కోట్ల ప్రాజెక్టులను అమిత్ షా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

"దశాబ్దాలుగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. ఈ ధోరణి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు నుంచే జరుగుతోంది. కానీ, మీరు(ప్రతిపక్షాలు) అనుసరిస్తున్న ఈ ప్రతికూల రాజకీయాలను చూస్తుంటే, 2030 నాటికి కూడా ఎన్నికల్లో గెలవలేరు. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే గెలుస్తుందో అక్కడ ఎన్నికల సంఘం బాగా పనిచేస్తుందని, ఎక్కడ ఓడిపోతే అక్కడ ఈసీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే, నిరసనలు, ఆందోళనలు చేయడం వల్ల సాధించేదేమీ లేదు. ఇక యమునా నది విషయానికొస్తే, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ పాలకులు మురుగునీటిని వదిలేయడంతోనే యమునా నది కలుషితంగా మారింది. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం మురుగునీటి విడుదలను తగ్గించగలిగింది. యమునా నదికి పునరుజ్జీవం కల్పించిన తర్వాతే 2029 సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజల మద్దతు కోరతాం."

**'ఇప్పటికే 40 శాతానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేశాం'**

దిల్లీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడానికి గత ప్రభుత్వం ఏమీ చేయలేదని, కేవలం ఆందోళనలు, నిరసనల ద్వారానే రాజకీయాలు చేసిందని షా విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం భారీ ప్రక్షాళన చేపట్టామని అన్నారు. రాజధానిలో పేరుకుపోయిన చెత్త డంపింగ్ ప్రదేశాలను ఖాళీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షా గుర్తు చేశారు. "దిల్లీలో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి నెలలోనే మోదీ ఒక కీలక సమావేశాన్ని నిర్వహించారు. యమునా నది శుద్ధికి సంబంధించిన తన దార్శనికతను ఆయన దిల్లీ ప్రభుత్వానికి, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించారు. ఇంత తక్కువ వ్యవధిలోనే, ఈ లక్ష్య సాధన దిశగా మనం ఇప్పటికే 40 శాతానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేశాం. మురుగునీటి శుద్ధి, తాగునీటికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను కూడా కలిగి ఉన్న రూ.9,000 కోట్లకు పైగా విలువైన ఈ ప్రాజెక్టులు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇతర అధికారుల కృషి ఫలితంగా ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొత్తగా ప్రారంభించిన కార్యక్రమాలు నది సమగ్ర పునరుజ్జీవనానికి వెన్నెముకగా నిలుస్తాయి. అలాగే నగర తాగునీటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాయి" అని షా నొక్కి చెప్పారు. అంతకుముందు, నక్సలిజాన్ని రూపుమాపినట్లే దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని కూడా తరిమేస్తామని అమిత్‌షా స్పష్టం చేశారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. అన్ని రాష్ట్రాల పోలీసులు కలసికట్టుగా, రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు.

## ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్ నిరసనలకు లింక్..
## ఫాక్స్ న్యూస్ రిపోర్ట్‌తో కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్

**ఫాక్స్ న్యూస్ కథనాన్ని ఉటంకిస్తూ కాంగ్రెస్‌పై బీజేపీ తీవ్ర దాడి**

**ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్‌లోని నిరసనలకు సంబంధం ఉందన్న రిపోర్ట్**

**ఇది కాంగ్రెస్ 'ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర' అని ఆరోపణ**

ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న అల్లర్లకు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు మధ్య సంబంధం ఉందంటూ అమెరికన్ మీడియా సంస్థ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన కథనాన్ని బీజేపీ ఈ సందర్భంగా ఉటంకించింది. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పన్నిన కుట్ర అని ఆరోపిస్తూ, రాహుల్ గాంధీ ద్రోహి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఫాక్స్ న్యూస్ డిజిటల్ నిర్వహించిన పరిశీలనలో, 13 దేశాలకు చెందిన 101 సంస్థలు ఈ నిరసనలను సమన్వయం చేస్తూ మద్దతు ఇస్తున్నట్లు తెలిసిందని సదరు కథనం పేర్కొంది. ఫ్రాన్స్‌లోని అశాంతికి, భారత్‌లో యువత నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలకు మధ్య అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు ఆరోపించింది. గురువారం ఈ నివేదికను ఆధారంగా చేసుకుని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో మాట్లాడారు. "ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకాన్ని, ద్రోహాన్ని ప్రోత్సహించే నమూనాను ప్రదర్శిస్తున్నారు. ఈ కుట్రలకు విదేశీ ఏజెన్సీలతో సంబంధాలు ఉన్నాయని నేటి నివేదిక బట్టబయలు చేసింది. కాబట్టి, ఈ ద్రోహుల నాయకుడు ఎవరు? అని ప్రశ్నించడంలో తప్పు లేదు" అని భాటియా ధ్వజమెత్తారు. దురదృష్టవశాత్తు మన ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా వ్యవహరిస్తున్నారని, లభిస్తున్న ఆధారాల ప్రకార ఆయనను దేశద్రోహి లేదా మీర్ జాఫర్ అని పిలవడంలో అతిశయోక్తి లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం 'రెడ్-గ్రీన్ ఎకోసిస్టమ్ ఆఫ్ ప్రొటెస్ట్' నడుస్తోందని, ఇందులో 'రెడ్' అంటే కమ్యూనిస్ట్ వర్గాలని, 'గ్రీన్' అంటే ఇస్లామిక్ వర్గాలని ఆయన వివరించారు.

## మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి..

తమిళనాడు ప్రభుత్వం మంత్రులు, శాసనసభ్యులకు కేటాయించే అధికారిక వాహనాల కొనుగోలుపై కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. మంత్రులు, ఇతర సీనియర్ ప్రజాప్రతినిధులకు రూ. 26 లక్షల వరకు, ఇతర ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షల వరకు గరిష్ఠ ధర పరిమితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభ్యుల ప్రయాణ భత్యం నిబంధనలను సవరిస్తూ కొత్త గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నూతన నిబంధనల ప్రకారం.. మంత్రులతో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు, ప్రభుత్వ చీఫ్ విప్‌ల కోసం కొనుగోలు చేసే వాహనం ధర రూ. 26 లక్షలకు మించకూడదు. మిగతా ఎమ్మెల్యేలందరికీ ఈ పరిమితిని రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఈ గరిష్ఠ ధరలోనే వాహనం ఎక్స్-షోరూమ్ ధర, పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మోటారు ఇన్సూరెన్స్ ప్రీమియంలు కలిసి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే, ఏటా ఈ ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాహనాల కొనుగోలును కేంద్ర ప్రభుత్వానికి చెందిన "గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్" పోర్టల్ ద్వారానే చేపట్టాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొనుగోలు చేసే వాహనాలు తప్పనిసరిగా భారత్ స్టేజ్-ఎ× ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. మంత్రులకు కేటాయించే వాహనాలను తమిళనాడు ప్రభుత్వం తన పేరుపైనే కొనుగోలు చేస్తుంది. స్పీకర్, ఇతర శాసనసభ్యుల వాహనాల కొనుగోలు ప్రక్రియను అసెంబ్లీ సచివాలయం పర్యవేక్షిస్తుంది. మంత్రులు తమ పదవీకాలం ముగిసినప్పుడు, అనర్హత వేటుకు గురైనప్పుడు లేదా ఇతర కారణాలతో పదవిని కోల్పోయినప్పుడు తమకు కేటాయించిన వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. స్పీకర్, ఇతర ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే, సాధారణ ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన వాహనాల నిర్వహణ, మరమ్మతులు, ఇంధనం, డ్రైవర్ వేతనాల ఖర్చును వారికి చెల్లించే వాహన భత్యం నుంచే భరించాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల వాహన అర్హతలు, కొనుగోలు ప్రక్రియ, పరిపాలనా బాధ్యతలపై స్పష్టతనిస్తూ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇ. సుందరవల్లి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆర్థిక సంక్షోభంలో అండగా నిలిచారు

తమ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు శ్రీలంక ప్రభుత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి చతురంగ అబేసింఘే ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో భారత్ తమకు వెన్నెముకగా నిలిచిందని ఆయన కొనియాడారు. 2022లో శ్రీలంకను చుట్టుముట్టిన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని అబేసింఘే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంధనం, నిత్యావసరాల తీవ్ర కొరతతో పాటు ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటడంతో దేశం అల్లకల్లోల స్థితిని ఎదుర్కొందని వివరించారు. "ఆ కష్టకాలంలో మాకు తోడుగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా ధన్యవాదాలు. మీరు అందించిన ఆర్థిక సహాయం సంక్షోభం నుంచి గట్టెక్కడానికి మాకు ఎంతగానో దోహదపడింది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీలంక సంక్షోభం నుంచి పూర్తిగా కోలుకుందని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అబేసింఘే తెలిపారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కీలక సంస్కరణలు ప్రవేశపెట్టామని వివరించారు. భవిష్యత్తులో రుణ చెల్లింపుల విషయంలో ఎటువంటి రిస్క్ ఉండదని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఇకపై దేశాన్ని స్థిరత్వం నుంచి వృద్ధి పథం వైపు నడిపిస్తామని, ఇందులో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. 1990లలో భారత్ క్రమంగా తన మార్కెట్లను తెరిచిన విధానం తమకు ఒక ఆదర్శమని అభిప్రాయపడ్డారు. పారా-టారిఫ్‌లను తొలగించడం, మరిన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి చర్యలతో వృద్ధిని సాధిస్తామని చెప్పారు. 2019 నుంచి నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నామని, రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో పారిశ్రామిక, ఆర్థిక మార్పుల కోసం ఇతర దేశాలతో భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నామని అబేసింఘే స్పష్టం చేశారు.

## మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. భారత్?తో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని మోదీని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆహ్వానించారు. భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో జ్యోతి వెలిగించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం నెతన్యాహు గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలను మోదీ ప్రశంసించినట్లు తెలిపారు. భారత ప్రధాని మోదీతో మాట్లాడటం సంతోషంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి వెలిగించాలని మోదీని ఆహ్వానించినట్లు వివరించారు. ఈ ఆహ్వానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారని నెతన్యాహు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. భూమిపై మాత్రమే కాకుండా గగనతలంలోనూ ఇరు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని మోదీ అభిప్రాయపడినట్లు నెతన్యాహు తన పోస్టులో వివరించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నుంచి ఫోన్? కాల్? వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో సాధించిన వృద్ధిని ఇరు దేశాధినేతలు సమీక్షించినట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ నిబద్ధతను ఇరువురు నేతలు పునరుద్ఘాటించారని తెలిపారు. అలాగే పశ్చిమాసియా పరిణిమాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పినట్లు పేర్కన్నారు.

**విమానంలో పైలట్‌పై దాడి**

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో ఈ ఘటన జరిగింది. విమాన కాక్‌పిట్‌లో సహ పైలట్ దాడి చేయడంతో భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ విమానంలో 27 మంది చిన్నారులు సహా మొత్తం 174 మంది ప్రయాణికులు ఉన్నారు. కాక్‌పిట్‌లో కత్తితో జరిగిన దాడిలో తీవ్ర గాయాలపాలైనప్పటికీ మచ్చర్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. దీంతో విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా దింపారు.

**ధైర్యసాహసాలకు ప్రశంసలు**

విమానంలో జరిగిన తీవ్ర పరిస్థితుల్లో మచ్చర్ వ్యవహరించిన తీరుపై భారత్, ఇజ్రాయెల్ ప్రధానులు గతంలో ప్రశంసలు కురిపించారు. ప్రయాణికుల భద్రతకు ముప్పు ఏర్పడిన సమయంలో ఆయన చూపిన ధైర్యాన్ని ఇద్దరు నేతలూ అభినందించారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మచ్చర్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే స్మిత్ మచ్చర్?కు ఇజ్రాయెల్ ప్రభుత్వం 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' పురస్కారాన్ని ప్రకటించింది. ఇది ఆ దేశ అత్యున్నత శౌర్య పురస్కారం.

**భారత్-ఇజ్రాయెల్ సంబంధాలకు మరో గుర్తింపు**

భారత్, ఇజ్రాయెల్ మధ్య రక్షణ, భద్రత, సాంకేతికత సహా పలు రంగాల్లో సహకారం కొనసాగుతోంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పరస్పర సహకారం, భద్రతా అంశాలపై సమన్వయం ఇరు దేశాల సంబంధాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీకి నెతన్యాహు పంపిన ఆహ్వానం దౌత్యపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# బీసీలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగ సాయన్న పోరాట గాథలు ఇప్పటికీ జానపద పాటల రూపంలో ప్రజల్లో నిలిచివున్నాయని చెప్పారు. అలాంటి చారిత్రక వ్యక్తుల సేవలను భావితరాలకు తెలియజేయాలని, వారి త్యాగాలు, పోరాటాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని అన్నారు.



### ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

తెలంగాణ చరిత్రలో సామాజిక న్యాయం కోసం పోరాడిన ప్రముఖులకు గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయులను సమాజం ఎప్పటికీ స్మరించుకోవాలని అన్నారు. అలాగే అందెశ్రీ, గద్దర్ వంటి ప్రజాకవులు, కళాకారులకు తమ ప్రభుత్వం అండగా నిలిచిందని వివరించారు.

### ముదిరాజ్‌లకు సముచిత ప్రాధాన్యం

ముదిరాజ్ సామాజికవర్గానికి తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజ్ జనాభా గణనీయంగా ఉందని, గతంలో ఆ వర్గానికి చెందిన ప్రజలు తనకు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరిచిపోనని చెప్పారు. వారికి సంపూర్ణ న్యాయం చేయడానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించానని గుర్తుచేశారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఇతర నాయకులకు కూడా భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### కులగణనతో సామాజిక న్యాయానికి బాటలు

కులగణన అంశంపై సీఎం మాట్లాడుతూ.. కులాలవారీగా జనాభా వివరాలను సేకరించడం ద్వారా వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. తమ ప్రభుత్వం కులగణన ప్రక్రియను పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. బీసీ సామాజికవర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలన్న డిమాండ్ తమ దృష్టిలో ఉందని తెలిపారు. ఈ అంశంపై సంబంధిత సామాజిక, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

### ఎస్సీ వర్గీకరణతో మరో కీలక ముందడుగు

ఎస్సీ కులాల వర్గీకరణ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కార దిశగా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయం సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. వెనుకబడిన వర్గాలు, పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### పేదలకు సన్నబియ్యం పంపిణీ

పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అమలైన సంక్షేమ పథకాలను మరింత విస్తరించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రేషన్ ద్వారా అందించే బియ్యం పేద కుటుంబాలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు.

### ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. బీసీ, ఎస్సీ, ఇతర వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంతో పాటు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమకు అండగా నిలవాలని కోరుతూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను గుర్తించి, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సీఎం పేర్కొన్నారు.

# వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్..

-మొదటిపేజీ తరువాయి

అయితే చారిత్రక ప్రదేశాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం, నగరాభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం అవసరమనే నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చింది.

### రూ.382 కోట్లతో అభివృద్ధి పనులు

వరంగల్ ప్రాంత అభివృద్ధికి మంజూరైన రూ.382 కోట్లతో పలు కీలక పనులు చేపట్టనున్నారు. ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్ ఏర్పాటు, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యాన్ని కాపాడుతూనే సందర్శకులకు మెరుగైన అనుభూతిని కల్పించేలా అభివృద్ధి పనులను రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల మధ్య అనుసంధానం, సందర్శకుల రాకపోకలు, పర్యాటక నిర్వహణ మరింత సులభతరం అయ్యే అవకాశం ఉంది. అయితే ఒక్కో ప్రాజెక్టుకు కేటాయించే నిర్దిష్ట నిధులు, పనుల వారీగా అంచనాలు, పూర్తి చేయాల్సిన గడువుల వివరాలు సంబంధిత అమలు ప్రణాళికల ఆధారంగా వెల్లడికానున్నాయి.

### ఖిల్లా వరంగల్‌కు పూర్వవైభవం

కాకతీయుల ఘన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఖిల్లా వరంగల్ ఈ అభివృద్ధి ప్రణాళికలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కోట నిర్మాణ శైలి, శిల్పకళ, చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూ పునరుద్ధరణ పనులు చేపట్టడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. చారిత్రక కట్టడాల పరిరక్షణలో వాటి అసలు స్వరూపం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకం. అందుకు అనుగుణంగా నిపుణుల పర్యవేక్షణ, తగిన సంరక్షణ పద్ధతులు, సందర్శకుల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు పూర్తయితే కాకతీయుల చరిత్రను తెలుసుకోవాలనుకునే విద్యార్థులు, పరిశోధకులు, దేశీయ, విదేశీ పర్యాటకులకు ఖిల్లా వరంగల్ మరింత ఆకర్షణీయంగా మారనుంది.

### సెంట్రల్ ప్లాజాతో కొత్త ఆకర్షణ

నగర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సెంట్రల్ ప్లాజా నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజలు, పర్యాటకులు సమయం గడిపేందుకు అనువైన ప్రదేశాలను అభివృద్ధి చేయడం, పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం వంటి లక్ష్యాలకు ఇటువంటి ప్రాజెక్టులు ఉపయోగపడతాయి. సెంట్రల్ ప్లాజా వంటి అభివృద్ధి పనులు నగరంలో ప్రజా ప్రదేశాల వినియోగాన్ని పెంచడంతో పాటు స్థానిక వ్యాపారాలకు కూడా పరోక్షంగా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. పర్యాటకులు ఎక్కువ సమయం నగరంలో గడిపేలా అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తే హోటళ్లు, ఆహార కేంద్రాలు, స్థానిక హస్తకళలు, రవాణా రంగాలకు మేలు కలగవచ్చు.

### బస్ టెర్మినల్‌తో రవాణా సౌకర్యాలు

వరంగల్ ప్రాంతానికి వివిధ జిల్లాలు, పట్టణాల నుంచి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే వారి సంఖ్య పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని బస్ టెర్మినల్ అభివృద్ధి



కూడా ప్రణాళికలో చోటు చేసుకుంది. ఆధునిక రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు సౌకర్యం కలగడంతో పాటు నగరంలో రాకపోకల నిర్వహణ మెరుగుపడే అవకాశం ఉంది. బస్సుల రాకపోకలు, ప్రయాణికుల వేచి ఉండే ప్రదేశాలు, ఇతర అనుబంధ సదుపాయాలను సమర్థంగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడం మరింత సులభం కావచ్చు. అయితే టెర్మినల్ నిర్మాణానికి సంబంధించిన పూర్తి నమూనా, సామర్థ్యం, స్థల వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాత స్పష్టత రానుంది.

### వేయి స్తంభాల ఆలయ పరిసరాల అభివృద్ధి

హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయం కాకతీయుల శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. అద్భుతమైన రాతి శిల్పాలు, నిర్మాణ ప్రత్యేకతలతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఆలయ పరిసరాల అభివృద్ధి ప్రణాళికతో సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది. ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా నిర్వహించడం, సందర్శకుల రాకపోకలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, చారిత్రక ప్రదేశానికి తగిన రీతిలో పరిసరాలను తీర్చిదిద్దడం వంటి అంశాలు ఈ అభివృద్ధిలో కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో ఆలయ చారిత్రక స్వరూపం, శిల్ప సంపద, వారసత్వ విలువలను కాపాడటం అత్యంత ప్రాధాన్యమైన అంశం.

### మ్యూజికల్ గార్డెన్‌తో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణ

వరంగల్ ప్రాంత పర్యాటక అభివృద్ధిలో మ్యూజికల్ గార్డెన్ ప్రాజెక్టు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉద్యానవనాలు, వినోద సదుపాయాలు పర్యాటకులకు విశ్రాంతి కల్పించడంతో పాటు కుటుంబాలతో వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తాయి. మ్యూజికల్ గార్డెన్ వంటి ప్రాజెక్టులు సమర్థంగా రూపుదిద్దుకుంటే నగరంలో వినోద, పర్యాటక కార్యకలాపాలకు మరిన్ని అవకాశాలు ఏర్పడవచ్చు. ముఖ్యంగా సెలవు రోజుల్లో పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు రూపకల్పన, అందుబాటులో ఉండే సౌకర్యాలు, నిర్వహణ విధానం వంటి వివరాలు అమలు దశలో స్పష్టమవుతాయి.

### కుడా పర్యవేక్షణలో ప్రాజెక్టుల అమలు

ఈ అభివృద్ధి పనులను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. పలు ప్రాంతాల్లో చేపట్టే పనులను సమన్వయం చేయడం, ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించడం, నిధుల వినియోగాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగించడం వంటి అంశాల్లో సంస్థ పాత్ర కీలకం కానుంది. ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేయడంతో ప్రాజెక్టుల అమలుకు అవసరమైన తదుపరి ప్రక్రియలు ముందుకు సాగేందుకు అవకాశం ఏర్పడింది. పనుల టెండర్లు, సాంకేతిక అనుమతులు, నిర్మాణ ప్రణాళికలు, క్షేత్రస్థాయి అమలు వంటి దశలు పూర్తయిన తర్వాత వివిధ ప్రాజెక్టుల పనులు పురోగతిలోకి రానున్నాయి. నిర్ణీత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయడం ద్వారా ప్రజాధనం సమర్థంగా వినియోగించినట్లవుతుంది.

### ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధికి ఊతం

ఈ ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారంతో మౌలిక సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి, పట్టణ ప్రణాళికలకు సంబంధించిన పనులు చేపట్టడం ద్వారా ప్రాజెక్టులకు ఆర్థిక మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే నిధుల విడుదల, వినియోగ నిబంధనలు, ప్రాజెక్టుల వారీగా ఆర్థిక వివరాలు సంబంధిత అధికారిక పత్రాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనుల్లో నిధుల వినియోగంపై పారదర్శకత, నాణ్యతా ప్రమాణాల అమలు, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ఇవన్నీ సమర్థంగా అమలైతే వరంగల్ ప్రాంతంలో దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది.

### పర్యాటక రంగానికి కొత్త ఊపు

వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలు ఇప్పటికే తెలంగాణ పర్యాటక రంగంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. వీటికి ఆధునిక సదుపాయాలు జోడించి, చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి చేస్తే వరంగల్ పర్యాటక ప్రాధాన్యం మరింత పెరిగే అవకాశం ఉంది. పర్యాటకుల సంఖ్య పెరిగితే స్థానిక గైడ్లు, రవాణా సేవలు, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, హస్తకళల విక్రయదారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడవచ్చు. యువతకు పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం కలగవచ్చు.

### నగర రూపురేఖల్లో మార్పులకు అవకాశం

రూ.382 కోట్ల అభివృద్ధి ప్రణాళిక వరంగల్ నగరానికి కీలకమైన ముందడుగుగా భావించవచ్చు. చారిత్రక కట్టడాల పరిరక్షణ, రవాణా సౌకర్యాల మెరుగుదల, ప్రజా ప్రదేశాల అభివృద్ధి, పర్యాటక ఆకర్షణల విస్తరణ వంటి అంశాలు సమన్వయంతో అమలైతే నగర రూపురేఖల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ ప్రణాళిక విజయవంతం కావాలంటే పనులు నిర్ణీత ప్రమాణాలతో, సమయానికి పూర్తికావడం కీలకం. చారిత్రక వారసత్వ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, స్థానిక ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాకతీయుల వైభవానికి ప్రతీకగా నిలిచిన ఓరుగల్లు నగరానికి కొత్త గుర్తింపు లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది

## టీడీఆర్ లావాదేవీల్లో మోసాలకు చెక్

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లు టీడీఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, లాగిన్, దరఖాస్తుల సమర్పణ వంటి సేవల కోసం ఆధార్ ధ్రువీకరణను వినియోగించుకోవచ్చు. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అధికారుల పరిపాలనాపరమైన లావాదేవీలకూ ఈ విధానం వర్తించనుంది. దీనివల్ల లావాదేవీల్లో జవాబుదారీతనం పెరగడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### ఆధార్ తప్పనిసరి కాదు

టీడీఆర్ సేవల కోసం ఆధార్ వినియోగం పూర్తిగా స్వచ్ఛందమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆధార్ కార్డుదారుల ముందస్తు అనుమతితోనే అథెంటికేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ఆధార్‌ను వినియోగించేందుకు ఇష్టపడని వారు లేదా సాంకేతిక కారణాలతో ఉపయోగించలేని వారికి సేవలను నిరాకరించబోమని ఉత్తర్వుల్లో పేర్కొంది.

### ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులతో అవకాశం

ఆధార్‌కు బదులుగా పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన ఇతర ఫొటో గుర్తింపు కార్డులను సమర్పించి ధ్రువీకరణ పొందవచ్చు. ఆధార్ చట్టం, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)తో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## డిండికి నీటి తరలింపు ఆపండి

-మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సన్నాలకు సిరులు.. ఆనందంలో అన్నదాతలు



**మిర్యాలగూడ:** ధాన్యం రైతులకు కలిసివస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సన్నధాన్యానికి క్వింటాకు రూ.4 వేలకుపైగా రికార్డుస్థాయిలో ధర వస్తోంది. సరిగా వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల్లో నీరు నిల్వ లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో వానాకాలంలో పూర్తిస్థాయిలో వరి సాగు చేయలేదు. సాగర్ ఆయకట్టులో బోర్లు, బావుల కింద మాత్రమే రైతులు సన్న రకం వరి సాగు చేశారు. సాగు తగ్గడం, ధాన్యం తక్కువగా ఉండటంతో సాగు చేసిన రైతులకు కలిసివస్తోంది.

### నల్లగొండలో 10.51 లక్షల మెట్రిక్ టన్నులు

నల్లగొండ జిల్లాలో 6 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుందని సీజన్ ప్రారంభంలో అధికారులు అంచనా వేశారు. కానీ 70శాతం (3,60,795) ప్రాంతంలో వరి సాగు చేశారు. 10.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా, ఇందులో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాలు సాగునీరు లేక ఎండిపోతాయని అంచనా వేశారు. ప్రధానంగా కనగల్, నల్లగొండ ప్రాంతాల్లో 2,500 ఎకరాలు ఎండిపోయినట్లు గుర్తించారు. సాగు తగ్గడంతో ధాన్యంపై ఆధారపడిన రైస్ ఇండస్ట్రీ సన్న ధాన్యానికి ధర పెంచేసింది. వారి మిల్లులు కెపాసిటీకి అనుగుణంగా ధాన్యం (ఝుఅఖు ఇష్త్రుఅఝుఎ) కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టారు. గోదావరి తీర ప్రాంతంలో ఉన్న నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా వరి పంట సాగు చేయడంతో నల్లగొండ జిల్లాకు చెందిన మిల్లర్లు బ్రోకర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రవాణాతో కలుపుకొని రూ.4 వేలకుపైగా ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పండించిన ధాన్యానికీ ఆ మేరకు ధర చెల్లిస్తున్నారు.

## కొత్త బోర్లు బంద్.. ఉల్లంఘిస్తే భారీ జరిమానా!



**హైదరాబాద్:** తీవ్ర వర్షాభావం రీత్యా భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. క్యూర్ పరిధిలో అపార్టుమెంట్లలోని బోర్లు మొరాయిస్తున్నాయి. వచ్చే రుతుపవనాల వరకు ఉన్న 8 నెలలు అత్యంత కీలకం. దీంతో అధికార యంత్రాంగం నీటి వృథాపై చర్యలకు దిగింది. కొత్త బోర్ల తవ్వకాలపై నిషేధం విధించింది. విషయంలో క్షేత్రస్థాయి తనిఖీలకూ సిద్ధమైంది. నిర్మాణ రంగానికి శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని తప్పనిసరి చేసింది. ఈ ఆంక్షలు తాగునీటికే కాక నిర్మాణాలు, ఇతర అవసరాలకు వర్తిస్తాయి.

### రోజుకు 200 పైనే తవ్వకం..

క్యూర్‌లో సుమారు 13 నుంచి 15 లక్షలకు పైగా బోర్లున్నాయని అంచనా. రికార్డుల్లో మాత్రం 2.43 లక్షల బోర్లే. నిబంధనలకు విరుద్ధంగా రోజుకు సగటున 200పైగా కొత్త బోర్ల తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం. రోజుకు 100 బోర్లు ఎండిపోతున్నాయి. కొండాపూర్, బంజారాహిల్స్, బండ్లగూడ జాగీర్ వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్‌వాసులు 400 అడుగుల పరిమితిని దాటి తవ్వుతున్నారు. కొన్నిచోట్ల వెయ్యి అడుగులకు మించుతున్నారు. ఫలితంగా భూగర్భ జలాల వినియోగం 102 శాతానికి చేరింది. నేలలోకి చేరుతున్న నీటి కంటే ఎక్కువ తోడేస్తుండడంతో భూగర్భ జల లభ్యత 'క్రిటికల్'గా ఉన్నట్లు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. --భూగర్భ జల పరిరక్షణకు నీరు--భూమి--చెట్టు చట్టం (వాల్టా) పకడ్బందీ అమలుకు యంత్రాంగం సిద్ధమైంది. సొంతంగా బోరు వేసుకోవాలన్నా రెవెన్యూ శాఖ అనుమతి తప్పనిసరి. 400 అడుగుల పరిమితి ఉంది. కానీ, 500--1,500 అడుగుల వరకు తవ్వుతున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్, భూగర్భ జల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానాలు విధించే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్‌డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. చట్టాలుతెలుసుకోండి మరిన్ని కనుగొనండి చట్టాలు తెలుసుకోండి పథకాలు చూడండి రాజకీయాలు చూడండి ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.

# కాంగ్రెస్‌కు చెంపపెట్టు

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉద్యోగులను నమ్మించి మోసం చేసేందుకు వేసిన ఎత్తుల్లో, పన్నిన పన్నాగాల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బొక్కబోర్లా పడింది. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో విజయానికి ప్రతీకగా మారిన బాణం గుర్తును తాను సమర్థించే ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు ఇప్పించుకుని గెలుపును ఎలాగైనా తన ఖాతాలో వేసుకోవాలని చూసింది. తనకు అనుకూలంగా లేని ఎంప్లాయీస్ యూనియన్ కూటమి (ఈయూ)ను ఓడించేందుకు ఆఖరి నిమిషం దాకా వేసిన పాచికలేవీ పారలేదు. చివరికి రీజియన్ ఫలితాల లెక్కలను తారుమారు చేసి చూపేందుకూ ప్రయత్నించింది. తాను మద్దతిచ్చిన కూటమిదే ఆధిక్యత అని చాటేందుకు బ్యాలెట్ గుర్తుల కేటాయింపు దగ్గర నుంచి రీజియన్ ఫలితాలను తిమ్మిని బమ్మిని చేయడం వరకు అన్నిరకాలుగా అడ్డదార్లు తొక్కినప్పటికీ అధికార పక్షానికి అంతిమంగా పరాభవమే మిగిలింది. మొత్తం పోలైన ఓట్లు 34,421 కాగా, ఈయూ 18,276 ఓట్లు దక్కించుకుని విజేతగా నిలిచింది. కాంగ్రెస్ సమర్థన పొందిన టీడబ్ల్యూయూ 13,556 ఓట్లతో పరాజయం పాలైంది. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టుగా నిలిచాయి. కుట్రలు, కుహకాలతో విజయాన్ని సొంతం చేసుకోవడం కుదరదని పాలకపక్షానికి స్పష్టమైన సంకేతాలిచ్చాయి. అన్నిరకాల విపరీతపు ఎత్తుగడలను ఎదుర్కొని విజయాన్ని దక్కించుకున్న ఈయూ ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కార్మికులు తన మీద ఉంచిన నమ్మకం వమ్ముకాకుండా ఉండాలంటే దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలి. కొన్ని ఇతర ఉద్యోగ సంఘాల తరహాలో రాజీ పడకుండా పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు గట్టిగా కృషి చేయాల్సి ఉంటుంది. కార్మికుల డిమాండ్లలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశం అత్యంత కీలకమైంది. మొన్నటిదాకా విలీనానికి ఎన్నికలతో ముడిపెట్టింది సర్కార్. ఎన్నికైన నేతలతోనే విలీన కమిటీ వేస్తామని ప్రకటించింది. తనకు అనుకూలమైన యూనియన్‌ను గెలిపించుకుని విలీనంపై తాత్సారం చేయాలనేది బహుశా ప్రభుత్వం ఆలోచనై ఉంటుంది. ఇప్పుడా అడ్డంకి తొలగిపోయింది కనుక తక్షణమే విలీన ప్రక్రియ ప్రారంభించాలని సర్కార్‌పై ఈయూ ఒత్తిడి తేవాలి. ఇంకా 2025లో సవరించిన వేతన స్కేళ్లను అమలు చేయాల్సి ఉన్నది. బకాయిలు రూ.1,500 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ప్రభుత్వంతో తక్షణమే చర్చలు ప్రారంభించి ఓ కొలిక్కి తేవాలి. సిబ్బందిపై పనిభారం తగ్గించేందుకు అవసరమైన ఉపశమన చర్యలు చేపట్టడమూ తప్పనిసరి. ఎన్నికల ముందు కాంగ్రెస్ అన్నివర్గాల మాదిరిగానే ఆర్టీసీ ఉద్యోగులకు అరచేతిలో స్వర్గాన్ని చూపింది. తక్షణమే విలీనం జరిపి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన స్కేళ్లు, వైద్యం, ఇతర బెనిఫిట్లు అందజేస్తామని నమ్మబలికింది. భారం తగ్గించకపోగా ఉచిత బస్సు ప్రయాణం పేరిట ఆర్టీసీపై అదనపు భారం మోపుతున్నది. ఆ పథకం తాలూకు బకాయిలు చెల్లిస్తే సంస్థ కొంతైనా ఉపశమనం పొందుతుంది. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్ సకాలంలో చెల్లించే వెసులుబాటు ఏర్పడుతుంది. మరోవైపు ఆర్టీసీ ఆస్తులు అమ్ముకునేందుకు, దశలవారీగా ప్రైవేటీకరించేందుకు సర్కార్ కుట్రలు పన్నుతున్నది. ఖాళీల భర్తీ లేకపోవడంతో ఉద్యోగులపై పనిభారం పెరుగుతున్నది. దీనివల్ల వారి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతున్నది. ఎన్నికల కసరత్తు పూర్తయింది కనుక ఇటు ప్రభుత్వం, అటు ఎంప్లాయీస్ యూనియన్ హామీల అమలుకు, సమస్యల పరిష్కారానికి విభేదాలను పక్కన పెట్టి వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# కాక్రోచ్ పార్టీకి దీపావళి సెలవులు

**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ లీడర్లు దీపావళి వరకూ సెలవులు ప్రకటించుకున్నారు. అప్పటి వరకూ ఎలాంటి ఆందోళనలు చేయబోమని దీప్కే ప్రకటించారు. ఈ ప్రకటనలకు కారణం వారి అంతర్గత నిస్సహాయతే ప్రధాన కారణమని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. పార్టీ కీలక నాయకులు దాస్, రాంకా లాంటి వారు ఊహించని విధంగా జైలుపాలు కావడంతో కేడర్‌లో నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింది. అగ్రనేతల వెంటే ఉండి నడిపించాల్సిన ముఖ్యులే కటకటాల వెనక్కి వెళ్లేసరికి, రోడ్డెక్కి వారి కోసం పోరాడే దిక్కులేక శ్రేణులంతా ఎవరికి వారు సర్దుకుపోయి సైలెంట్ అయ్యారు. ఈ సంక్షోభ సమయంలో పార్టీకి అండగా నిలవాల్సిన ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖులు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. నటుడు ప్రకాష్ రాజ్ సైతం వివాదాలకు దూరంగా ఒక వీడియోను విడుదల చేసి, తన వ్యక్తిగత పనుల్లో తాను బిజీ అయిపోయారే తప్ప పార్టీ కోసం క్షేత్రస్థాయిలో గళం విప్పే సాహసం చేయడం లేదు. పండుగ తర్వాత కూడా ఈ కాక్రోచ్‌లను సీరియస్‌గా పట్టించుకునే నాథుడే ఉండరు. ఒకప్పుడు హడావుడి చేసిన ఈ వర్గాన్ని, దేశంలోని జెన్-జీ యువత ఎప్పుడో పక్కనబెట్టి విడాకులు ఇచ్చేసింది. మారుతున్న ట్రెండ్స్, యువత ఆలోచనా విధానానికి తగినట్లుగా మారలేకపోవడంతో ఆ పార్టీ పూర్తిగా ఐసోలేట్ అయిపోయింది. కాక్రోచ్ జనతా పార్టీ ర్గాలన్నీ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అనుబంధ సభ్యులుగా, సానుభూతిపరులుగా మారిపోయారనేది పరిశీలకుల మాట. తాత్కాలిక హంగామాతో సోషల్ మీడియాలో ట్రెండ్ కావచ్చె?మో కానీ, గ్రౌండ్ రియాలిటీలో నిలకడ లేని ఇలాంటి రాజకీయ ప్రయోగాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవని మరోసారి రుజువవుతోంది. నాయకుల అరెస్టులు, మద్దతుదారుల వెనుకంజతో కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్ ప్రశ్నా ర్థకంగా మారింది. దీపావళి తర్వాత హడావుడి చేద్దామనుకున్న ఆ పార్టీ వ్యూహాలు ఇక పారకపోవచ్చు. ప్రభుత్వం వీరిపై వ్యతిరేకత పెంచడమే కాదు.. ఇదే అదనుగా కఠినంగా వ్యవహరించనుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించ బోమని వీరి వద్ద బాండ్లు తీసుకుని దాన్నే వారి చేతులు కట్టేయడానికి అవకాశంగా ఉపయోగించుకుంటున్నారు.



### మీరు జెన్ జీనా...

కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు సంబంధించిన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ధర్మాసనం వారి వయస్సును తెలుసుకున్న తర్వాత ఆ ఇద్దరు నాయకులు 'జెన్ జీ' కిందకు రారని వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా.. పిటిషనర్ల తరపున హాజరైన లాయర్ అభీక్ చిమ్నీని ఆ ఇద్దరు నాయకుల వయస్సు ఎంత అని జస్టిస్ ప్రసాద్ ప్రశ్నించారు. దాస్‌కి 27 ఏళ్లు, రంకాకి 32 ఏళ్లు అని న్యాయవాది కోర్టుకు తెలిపారు. "అలాగైతే మీరు జెన్ జీ కాదు. ఇంతకీ జెన్ జీ అంటే ఏమిటి?" అని కోర్టు ప్రశ్నించింది. సాధారణంగా 1997 తర్వాత జన్మించిన వారిని 'జెన్ జీ ' అని పిలుస్తారని తెలియజేయగా.. 'అలాంటప్పుడు మీరు జెన్ జీ కారనేది స్పష్టం' అని కోర్టు పునరుద్ఘాటించింది. పిటిషనర్ల జుడీషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగిస్తూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ సంభాషణ సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైంది. ప్రధాని మోదీ ఫోటోను సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కే పోస్ట్ చేస్తూ.. "జెన్ జీ అర్హత ఉన్న ఏకైక వ్యక్తి ఈయనే" అని రాసుకొచ్చారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులను సవాలు చేయడానికి 'రివిజన్' అనే ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో ఉన్నప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని కోర్టు ప్రశ్నించింది. "ఇది మీ రెండో సంఘటన.. మీరు గతంలో పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించారు. మీ అసలు పరిష్కారం రివిజన్ పిటిషన్‌లోనే ఉంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. శాంతి భద్రతల నిబంధనలను రెండోసారి ఉల్లంఘించినప్పుడు కఠినమైన షరతులను విధించే హక్కు అధికారులకు ఉంటుందా లేదా అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. జంతర్ మంతర్‌ను ధర్నా చౌక్‌గా తొలగిం చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, ఆ నోటిఫికేషన్‌పై ఎలాంటి స్టే లేదని కోర్టు గుర్తుచేసింది. అటువంటి పరిస్థితుల్లో పిటిషనర్లు మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లడంపై సందేహం వ్యక్తం చేసింది.

# కలల ప్రపంచాన్ని కూల్చిన బ్లాక్ థర్స్‌డే

1920వ దశకంలో అమెరికా వీధుల్లో కొత్త వెలుగులు విరబూశాయి. పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందాయి, రోడ్లపై కొత్త కార్లు పరుగులు తీశాయి, రేడియోలు ఇళ్లలోకి చేరాయి. ఈ కాలాన్ని చరిత్రలో 'రోరింగ్ ట్వెంటీస్' అని పిలుస్తారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా... ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా మారింది. ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చు అని బలంగా నమ్మారు. బడా వ్యాపారవేత్తల నుండి పారిశుద్ధ్య కార్మికుల వరకు తమ పొదుపు మొత్తాలను వాల్ స్ట్రీట్ షేర్ మార్కెట్లోకి గుమ్మరించారు. కంపెనీల నిజమైన విలువ ఎంత; వాటి ఉత్పత్తి, లాభాలు ఎంత అనే ప్రాథమిక సూత్రాలను పెట్టుబడిదారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. కేవలం ధర పెరుగు తోందనే ఏకైక కారణంతో షేర్లను కొనడం ప్రారంభించారు. ఈ విధంగా మార్కెట్లో ఒక భారీ ఊహాజనిత బుడగ (స్పెక్యులేటివ్ బబుల్) రూపుదిద్దుకుంది. ఆ కాలంలో మార్కెట్‌ను ముంచెత్తిన అతిపెద్ద ముప్పు 'అప్పు (మార్జిన్ మనీ)తో షేర్లు కొనడం'. పెట్టుబడిదారుడు తన సొంత డబ్బు కేవలం 10 శాతం నుండి 20 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన 80 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని బ్రోకర్ల నుండి అప్పు తీసుకునేవాడు. మార్కెట్ పెరుగుతున్నంత కాలం ఈ విధానం అద్భుతమైన లాభాలను తెచ్చిపెట్టినట్లు కనిపించింది. అయితే షేర్ ధరలు కొద్దిగా తగ్గినా, బ్రోకర్లు అదనపు మార్జిన్ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చేవారు. అదనపు నగదు చెల్లించలేని పరిస్థితుల్లో, బ్రోకర్లు ఆ షేర్లను బలవంతంగా మార్కెట్లో అమ్మకానికి పెట్టేవారు. ఇది మార్కెట్ పతనాన్ని మరింత వేగవంతం చేసే విధ్వంసకర చక్రంగా మారింది. అదే సమయంలో అమెరికా పరిశ్రమల్లో అవసరానికి మించి ఉత్పత్తులు పేరుకుపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచడం క్రెడిట్ లభ్యతను మరింత తగ్గించింది.

### బ్లాక్ థర్స్‌డేతో విధ్వంసం ప్రారంభం

1929 అక్టోబర్ 24, గురువారం న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో కొద్ది నిమిషాల్లోనే వాల్ స్ట్రీట్ వాతావరణం భయాందోళనలతో అల్లకల్లోలంగా మారింది. పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న షేర్లను వదిలించుకోవడానికి



పోటీపడ్డారు. ఆ ఒక్క రోజే దాదాపు 1.29 కోట్ల షేర్లు అమ్ముడయ్యాయి. బ్యాంకర్ల బృందం రంగంలోకి దిగి, మార్కెట్‌ను ఆదుకోవడానికి భారీగా షేర్లను కొనుగోలు చేయడంతో పతనం తాత్కాలికంగా ఆగింది. కానీ అక్టోబర్ 28 సోమవారం (బ్లాక్ మండే) డౌ జోన్స్ సూచీ 12.8 శాతం కూలిపోయింది. మరుసటి రోజు అక్టోబర్ 29న 'బ్లాక్ ట్యూస్డే' నాడు 1.6 కోట్లకు పైగా షేర్లు చేతులు మారాయి. దిగ్గజ కంపెనీల షేర్ల విలువలు పాతాళానికి పడిపోయాయి. సెప్టెంబర్ 3న 381 పాయింట్ల వద్ద ఉన్న డౌ జోన్స్ సూచీ 1932 జూలై నాటికి 41 పాయింట్లకు పడిపోయింది. ఏకంగా 89 శాతం ఆస్తి తుడిచి పెట్టుకుపోయింది. స్టాక్ మార్కెట్ సంక్షోభం క్రమంగా సామాన్యుడి జీవితాన్నీ తీవ్రంగా కుదిపివేసింది. కంపెనీల విలువ తగ్గిపోవడంతో పరిశ్ర మలు మూతపడ్డాయి, ఉద్యోగుల తొలగింపు మొదలైంది. 1933 నాటికి అమెరికాలోని ప్రతి ఐదు బ్యాంకుల్లో ఒకటి దివాళా తీసింది. 1932 నాటికి దేశంలో ప్రతి నలుగురు కార్మికులలో ఒకరు నిరుద్యోగిగా మారారు. కాగితాలు, రేకులతో వెలసిన అసంఖ్యాక తాత్కాలిక నివాసాలు నాటి మహా మాంద్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. ఈ ఆర్థిక పతనం 'గ్రేట్ డిప్రెషన్ 'గా రూపాంతరం చెంది ప్రపంచ దేశాలను చుట్టుముట్టింది. 'గోల్డ్ స్టాండర్డ్' ద్వారా సంక్షోభం ఇతర ఖండాలకు విస్తరించింది. జర్మనీలో ఏర్పడిన తీవ్ర నిరుద్యోగం అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీ అధికారంలోకి రావడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించింది. నాటి బ్లాక్ థర్స్‌డే ఘటన నేటి ఆర్థిక ప్రపంచానికి విలువైన పాఠాలను అందిస్తోంది. కేవలం ధర పెరుగుతోందనే ఒక్క కార ణంతో ఆస్తికి విపరీతమైన విలువ ఉందనుకోవడం పెద్ద భ్రమ. మార్జిన్ తో పెట్టుబడి పెట్టడం లాభాలను పెంచినట్లే, నష్టాల సమయాల్లో సర్వస్వం ఊడ్చేస్తుంది. జ్ఞానం కంటే భయం, అత్యాశ మాత్రమే మార్కెట్లను నడిపేటట్లయితే తీవ్రమైన విపత్తులు తప్పవు

# టైగర్ జోన్ నిబంధనలను సడలించాలి..

**ఎంపీ గోడం నాగేష్‌కు టీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ విజ్ఞప్తి..**



**జన్నారం,అక్టోబర్22(సూర్యరేఖ)** ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్‌ను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి యువజన సంఘం (టీవైఎస్)రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి జన్నారం ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ గోడం నాగేష్‌కు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జన్నారం ప్రాంతంలో టైగర్ జోన్ నిబంధనల కారణంగా గిరిజనులు,బీసీలు,ఎస్సీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీకాంత్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఇళ్లను సైతం నిర్మించుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, ఇటుకలు,ఎండిపోయిన కట్టెలను తీసుకురావడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.అంతేకాకుండా, ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను సైతం తీసుకురానివ్వడం లేదని తెలిపారు.పశువులను మేత కోసం అడవికి తీసుకెళ్లడానికి కూడా అనుమతించడం లేదని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యలపై ఎంపీ ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీలోని టైగర్ జోన్ కమిటీతో చర్చించాలని శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.ప్రజల కనీస అవసరాలకు ఇబ్బంది కలగకుండా టైగర్ జోన్ నిబంధనల్లో అవసరమైన సడలింపులు కల్పించేలా కృషి చేయాలని కోరారు. అవసరమైతే జన్నారంతో పాటు టైగర్ జోన్ పరిధిలోని ముఖ్యమైన ప్రతినిధులు ఎంపీతో కలిసి ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దీనిపై మరోసారి చర్చిద్దామని ఎంపీ స్పందించినట్లు శ్రీకాంత్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి యువజన సంఘం (టీవైఎస్)రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్,తో పాటు దబ్బెటి అశోక్,విద్యార్థి యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు మెస్రం భాస్కర్,టీవైఎస్ జిల్లా అధ్యక్షులు సెడ్మకి భీమ్ రావు,జమిల్,ఒడ్డెర సంఘం మండల అధ్యక్షులు బొంతల లక్ష్మణ్,సయ్యద్ రిజ్వాన్, కొండపల్లి మహేష్,గోలి చందు,సందవేణి పవన్, మామిడి విజయ్,తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పాల్గొన్న వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,అక్టోబర్22(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న శారన్నవరాత్రి ఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొని శ్రీదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నాచారం డివిజన్‌లోని వీఎస్‌టీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించారు. అనంతరం కాప్రా గిరిజన బస్తీలో మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు నిర్వహించారు.ఉప్పల్ కుమ్మరి బస్తీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంతో పాటు వెంకట్ రెడ్డినగర్ డివిజన్‌లోని రామ్ రెడ్డినగర్‌లో జరుగుతున్న శారన్నవరాత్రి ఉత్సవాలలోనూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...అమ్మవారి కటాక్షం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం,ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆయా మండపాల నిర్వాహకులు మంత్రి శ్రీధర్ బాబు,జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి,లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు,కాలనీల వాసులు, భక్తులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో ఘనంగా ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు..

**బహుజనులంతా ఐక్యంగా పోరాడితేనే సామాజిక న్యాయం సాధ్యం: కొంపెల్లి ఉపేందర్**



**రామంతాపూర్,అక్టోబర్22(సూర్యరేఖ)** రామంతాపూర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద తెలంగాణ బంధూక్‌గా,ప్రజావీరుడిగా,పాలమూరు ముద్దుబిడ్డగా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను రామంతాపూర్ ముదిరాజ్ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించి,ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు కొంపెల్లి ఉపేందర్ మాట్లాడుతూ...పండుగ సాయన్న కలలు కన్న రాజ్యాధికారాన్ని బీసీలు సాధించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.పండుగ సాయన్న పోరాటం కేవలం భౌతిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటం మాత్రమే కాదని,సామాజిక న్యాయం కోసం, రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కల్పించడం కోసం సాగిన పోరాటమని వివరించారు.నాటి నిజాం నిరంకుశ పాలనను ధైర్యంగా ప్రశ్నిస్తూ,బహుజన రాజ్య స్థాపన కోసం పండుగ సాయన్న కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను నెరవేర్చాల్సిన సమయం ఆసన్నమైందని, బహుజనులందరూ ఐక్యంగా ముందుకు సాగితే రాజ్యాధికారాన్ని సాధించడం సాధ్యమవుతుందని అన్నారు.నాటి భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న, వారి నుంచి సంపదను స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు పంచిన ప్రజావీరుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.నేటి యువత పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకుని,ఆయన పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పీసరి శంకర్,బి.సురేష్, కె. చంద్రకాంత్,పి.మురళీకృష్ణ,టి.జెట్టప్ప,జి.కృష్ణ,జి.ప్రవీణ్ కుమార్,జగదీష్, కీర్తి,కె. మనోజ్ కుమార్, విజయ్ కుమార్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రా యూత్ వింగ్స్ అధ్యక్షుడిగా రంజిత్ సింగ్ నియామకం..

**15ఏళ్ల అంకితభావంతో కూడిన సేవలకు గుర్తింపు..**

**సుప్రా ఫౌండేషన్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ కీలక నిర్ణయం**





**రామంతపూర్,అక్టోబర్22(సూర్యరేఖ)** సుప్రా ఫౌండేషన్‌కు గత 15సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న రంజిత్ సింగ్‌ను, ఆయన సేవలను గుర్తిస్తూ సుప్రా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ గడ్డం సాయికిరణ్ సుప్రా యూత్ వింగ్స్ అధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా రంజిత్ సింగ్ మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గడ్డం సాయికిరణ్ అన్నకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. యువతను ఏకతాటిపైకి తీసుకువస్తూ,మరింత అంకితభావంతో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. తన నియామక కార్యక్రమానికి హాజరై తనకు మద్దతుగా నిలిచి,ప్రోత్సాహాన్ని అందించిన ప్రతి సుప్రా సభ్యునికి రంజిత్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్, సుదర్శన్ రెడ్డి,సుధాకర్,హనుమంతరావు ,వెంకటేష్ గుప్తా,వెంకట్ సాయి,ప్రసాద్,రిజ్జు,చరణ్,శివ,సంతు, అనిల్,ప్రవీణ్,పవన్ తదితర సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.సుప్రా ఫౌండేషన్ ఎల్లప్పుడూ ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా పేదలకు,ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తోంది.ఆర్థిక సహాయం, వైద్య సహాయం, విద్యా సహాయం అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రజాసేవకు,సమాజ సంక్షేమానికి మరింత అంకితభావంతో కృషి చేస్తామని రంజిత్ సింగ్ తెలిపారు.

## అలయ్ బలాయ్‌తో సామాజిక ఐక్యతకు పిలుపు..

**బండారు దత్తాత్రేయ కార్యక్రమంలో పాల్గొన్న వై.శ్రీధర్**




**రాజేంద్రనగర్,అక్టోబర్22 (సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలాయ్ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై.శ్రీధర్ పాల్గొన్నారు. గత27 సంవత్సరాలుగా దసరా, విజయదశమి పండుగల అనంతరం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కుల సంఘాలు,సామాజిక సంఘాలు,మతాలకు చెందిన ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ సామాజిక ఐక్యతను చాటిచెబుతున్నారు.మన దారులు వేరైనా గమ్యం ఒక్కటేనని,సమాజ సేవ,సామాజిక న్యాయం,ప్రజా అభివృద్ధి అందరి లక్ష్యాలని ఈ కార్యక్రమం సందేశాన్ని ఇస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సోదరభావం,పరస్పర గౌరవం,స్నేహసంబంధాలను పెంపొందించడమే అలయ్ బలాయ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఏటా బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారని తెలిపారు.కులమతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని వై.శ్రీధర్ వెల్లడించారు. సోదరభావం,సామాజిక సమైక్యతకు నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలుస్తోందని తెలిపారు.బండారు దత్తాత్రేయ కుమార్తె,రాష్ట్ర బీజేపీ కార్యదర్శి విజయలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో వై.శ్రీధర్ పాల్గొని సామాజిక ఐక్యతకు సంబంధించిన సందేశాన్ని చాటిచెప్పారు.

## కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన బన్నాల గీతాప్రవీణ్



**ఉప్పల్,అక్టోబర్22(సూర్యరేఖ)** దసరా పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కేటీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## దసరా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులకు శుభాకాంక్షలు..

కొలన్ సుభాష్ రెడ్డి,నరేందర్(చిన్న)ను మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ సీనియర్ నాయకులు

పండుగ శుభాకాంక్షలతో ఆత్మీయ కలయిక



**రాజేంద్రనగర్,అక్టోబర్22(సూర్యరేఖ)** దసరా పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల అధ్యక్షుడు కొలన్ సుభాష్ రెడ్డిని,హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు నరేందర్ (చిన్న)ను పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు పోయిల జీవన్ దాస్,జాలిగం చిత్తారీ,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్(డేవిడ్),పార్టీ ఉద్యమ సీనియర్ నాయకుడు ఎడ్లకాడి సూర్యం తదితరులు నాయకులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.దసరా పండుగ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ పండుగ సంతోషాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంది.పండుగలు కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు,సహచరులు,పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో పరస్పర సహకారం,ఐక్యత ఎంతో ముఖ్యమని తెలిపారు.దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,శాంతి,సమృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ ఆత్మీయ కలయికలో పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పార్టీ నాయకులు తమ అనుబంధాన్ని చాటుకున్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



**కామారెడ్డి,అక్టోబర్22(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలను స్వీకరించారు.అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించిన పలు అంశాలపై చైర్మన్ గారు జిల్లా కలెక్టర్,తో చర్చించారు.ముఖ్యంగా జిల్లాలోని గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, గ్రంథాలయాల అభివృద్ధి,పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.జిల్లాలో గ్రంథాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేసి,ప్రజలకు మరియు విద్యార్థులకు మెరుగైన గ్రంథాలయ సేవలు అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టే అంశాలపై ఈ సందర్భంగా చర్చించడం జరిగింది.

## ఆర్యవైశ్య స్మశాన వాటిక,ఖబరస్థాన్‌లను పరిశీలించిన వీసారపు శ్రీపాల్‌రెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు..

పరిశీలించిన డీసీసీ ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్‌రెడ్డి





**మరిపెడ,అక్టోబర్ 22(సూర్యరేఖ)** మరిపెడ పట్టణ శివారులోని ఆర్యవైశ్య స్మశాన వాటిక,ముస్లింల ఖబరస్థాన్‌లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల పనులను డీసీసీ ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు ,చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జాటోతు సురేష్,కాంగ్రెస్ 3వ వార్డు అధ్యక్షుడు అనంతరెరి శ్రీను,ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు తల్లాడ వెంకట రామారావు,ముస్లిం పెద్దలు రజబ్ అలీ,జానీ తదితరులు పాల్గొన్నారు.

# టాస్కా చిలుకానగర్ శాఖకు శాశ్వత భవనం,డే కేర్ సెంటర్ మంజూరు చేయాలి..





జిల్లా కలెక్టర్‌కు టాస్కా ప్రతినిధుల వినతి

సానుకూలంగా స్పందించిన కలెక్టర్..

ఫీజిబిలిటీ నివేదిక రూపొందించాలని అధికారులకు ఆదేశం..

**చిలుకానగర్,అక్టోబర్22(సూర్యరేఖ)** చిలుకానగర్ ప్రాంతంలోని సీనియర్ సిటిజన్ల సంక్షేమం,సౌకర్యార్థం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా)చిలుకానగర్ డివిజన్ శాఖకు శాశ్వత భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించడంతోపాటు,వృద్ధుల కోసం ప్రభుత్వ డేకేర్ సెంటర్‌ను మంజూరు చేయాలని టాస్కా ప్రతినిధులు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.టాస్కా చిలుకానగర్ డివిజన్ శాఖ అధ్యక్షుడు బొమ్మగాని దాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి సీనియర్ సిటిజన్లకు శాశ్వత భవనం అవసరాన్ని వివరించింది.వృద్ధులు ఒకచోట సమావేశమై తమ సమస్యలను చర్చించుకోవడానికి,సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి,తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవడానికి శాశ్వత భవనం ఎంతో ఉపయోగపడుతుందని వారు వివరించారు.

**కలెక్టర్ సానుకూల స్పందన..**

టాస్కా ప్రతినిధుల విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించేందుకు సంబంధిత జిల్లా న్యాయ అధికారికి (లాఆఫీసర్)దరఖాస్తును సిఫారసు చేయడంతోపాటు,స్థలం కేటాయింపునకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదిక (ఫీజిబిలిటీ రిపోర్ట్)త్వరితగతిన రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ స్పందన పట్ల టాస్కా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం సంబంధిత జిల్లా న్యాయ అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేసిన ప్రతినిధులు,భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి, సీనియర్ సిటిజన్ల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

**వృద్ధుల కోసం డేకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి..**

చిలుకానగర్ ప్రాంతంలోని వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఉల్లాసం,విశ్రాంతి,ఆత్మీయ కలయికలు, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వ డే కేర్ సెంటర్‌ను మంజూరు చేయాలని కోరుతూ జిల్లా సంక్షేమ అధికారిని కూడా టాస్కా ప్రతినిధులు కలిసి మరో వినతిపత్రాన్ని సమర్పించారు.డేకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే వృద్ధులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు,తోటి వారితో ఆత్మీయంగా గడిపేందుకు,తమ సమస్యలను పంచుకునేందుకు, ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన పొందేందుకు అవకాశం కలుగుతుందని వారు పేర్కొన్నారు.

**సీనియర్ సిటిజన్ల సంక్షేమమే లక్ష్యం..**

సీనియర్ సిటిజన్లు సమాజానికి అమూల్యమైన సంపద అని,వారి అనుభవాలు,సేవలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని టాస్కా ప్రతినిధులు తెలిపారు.వృద్ధుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.శాశ్వత భవనం,డేకేర్ సెంటర్ ఏర్పాటు ద్వారా చిలుకానగర్ ప్రాంతంలోని వృద్ధులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టాస్కా చిలుకానగర్ డివిజన్ శాఖ అధ్యక్షుడు బొమ్మగాని దాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ విద్యాసాగర్,కార్యవర్గ సభ్యులు మైల ఐలయ్య,బుసిరెడ్డి నారాయణరెడ్డి, సలహాదారులు పెండెం నాగార్జున,రాంచర్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.సీనియర్ సిటిజన్ల హక్కులు,అవసరాల సాధనకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని టాస్కా చిలుకానగర్ డివిజన్ శాఖ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# ఏడాది దాటినా అందని కార్మికుల సంక్షేమ సాయం..

పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి..

మ్యారేజ్,డెలివరీ,డెత్ బెనిఫిట్స్ కోసం కార్మికుల ఎదురుచూపులు..

సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కొండ ఉప్పలయ్య




**మరిపెడ,అక్టోబర్22(సూర్యరేఖ)** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది దాటినా ప్రయోజనాలు అందడం లేదని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కొండ ఉప్పలయ్య ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం మరిపెడ మండల కేంద్రంలో కొండ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...కార్మికులకు అందాల్సిన వివాహ,ప్రసూతి, మరణ ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆర్థిక సహాయం మంజూరు కావడం లేదని తెలిపారు.ముఖ్యంగా మరణించిన కార్మికుల కుటుంబాలకు అందాల్సిన పరిహారం కోసం దరఖాస్తులు ఎక్కడ సమర్పించాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.ఏఎల్ఓ కార్యాలయంలో మరణ ప్రయోజనాల దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు.కొత్తగా దరఖాస్తు చేసుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు సైతం అందడం లేదని విమర్శించారు.తొర్రూరు ఏఎల్ఓ అధికారి వారానికి ఒకసారి మాత్రమే అందుబాటులో ఉండటంతో కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు.పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లన్నింటినీ తక్షణమే పరిష్కరించి,అర్హులైన కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని కొండ ఉప్పలయ్య విమర్శించారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి,గతంలో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులంతా ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో యూనియన్ మండల కార్యదర్శి యాదగిరి,భిక్షం,బండ వీరస్వామి,వెంకన్న, సైదులు,జామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్ఆర్ ఫౌండేషన్ ముందంజ..

శ్రీనివాస్ నగర్ కాలనీలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు..



**మేడ్చల్,అక్టోబర్23(సూర్యరేఖ)** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆర్ఆర్ ఫౌండేషన్ నిరంతరం ప్రజలకు సేవలందిస్తోందని ఫౌండేషన్ అధినేత,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేంద్రగౌడ్ పేర్కొన్నారు.మేడ్చల్ 297వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు ఆర్ఆర్ ఫౌండేషన్ చొరవతో పరిష్కారం లభించింది. దివంగత వేలూరి ప్రమోద్ మాట ప్రకారం,ఆయన ఆశయాలకు అనుగుణంగా కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించి,ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయించారు.ఈ సందర్భంగా రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ...ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు,వారి సమస్యలను పరిష్కరించడమే ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.శ్రీనివాస్ నగర్ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని స్తంభాలను ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.కాలనీలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత రాఘవేంద్ర గౌడ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కవిడే మహేష్,కటిక వినయ్,నరసింహారెడ్డి,రాహుల్‌తో పాటు శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం..

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి..

ప్రభుత్వానికి సంఘం నాయకుల విజ్ఞప్తి

మందమర్రిలో ఘనంగా పండుగ సాయన్న174వ జయంతి వేడుకలు..



**మందమర్రి,అక్టోబర్22(సూర్యరేఖ)** అణగారిన వర్గాల ఆత్మగౌరవం,పేదల సంక్షేమం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలంగాణ ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో పట్టణ ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కుల పెద్దల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నెల్లి రాజలింగు, ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్,ముల్కలపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న నిరుపేదలు,బడుగు బలహీన వర్గాల రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ పేదలకు అండగా నిలిచిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

**ముదిరాజ్‌ల సామాజిక న్యాయానికి కృషి చేయాలి..**

కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ అంశాన్ని ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించి, ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పడంతో పాటు,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏటా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అనవేన శంకర్,పిడుగు రాజేందర్,కందుల ఓదెలు, పోలు సంపత్,కుమ్మం రాజేందర్,పోలు కుమారస్వామి,మేకపోతుల శ్రీనివాస్, రెడ్డి సతీష్, మస్కం సతీష్,గనవేన స్వామి,పోతరవేన కుమార్, తొగరి కుమార్,ఈరవేన మల్లేష్,పల్లె మొగిలి, కలవేన విశ్వనాథ్,చిలుక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మూసివేసిన గని నీటితో పట్టణ ప్రజల దాహార్తి తీర్చే యత్నం..





నీటి భద్రతకు సింగరేణి ముందడుగు..

ఏరియాలో డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు పర్యటన

**మందమర్రి,అక్టోబర్22(సూర్యరేఖ)** భవిష్యత్తులో తాగునీటి కొరతను అధిగమించేందుకు సింగరేణి సంస్థ ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగంపై దృష్టి సారించింది.ఇందులో భాగంగా మందమర్రి పట్టణ ప్రజల అవసరాల కోసం మూసివేసిన కేకే-1గనిలోని నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు చెత్లాపూర్‌లో ఏర్పాటు చేసిన నూతన పంప్‌హౌస్‌ను సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)కె.వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు సంస్థకు అదనపు ఆదాయం సమకూర్చేలా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం,బొగ్గు ఉత్పత్తిని పెంచడం వంటి అంశాలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. చెతులాపూర్ పంప్‌హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ...మూసివేసిన కేకే-1గనిలో నిల్వ ఉన్న నీటిని పంప్‌హౌస్‌కు తరలించి శుద్ధి చేసిన అనంతరం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి రానున్న కాలంలో నీటి కొరత ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

**ఆయిల్‌పామ్ సాగుతో అదనపు ఆదాయం..**

మందమర్రి ఏరియాలోని మూసివేసిన కేకే-2గని సమీపంలో నర్సరీ వెనుక భాగంలో రెండు హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టిన ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను డైరెక్టర్ పరిశీలించి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సింగరేణిలోని ఇతర ఏరియాల్లో లేని విధంగా మందమర్రిలో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.ఈ మొక్కలు సుమారు30 ఏళ్లపాటు దిగుబడినిచ్చే అవకాశం ఉన్నందున సరైన సంరక్షణతో సంస్థకు అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చని పేర్కొన్నారు.ఈ విధానాన్ని ఇతర ఏరియాల్లోనూ అమలు చేయాలని ఆకాంక్షించారు.

**ఉత్పత్తి లక్ష్యాల సాధనకు దిశానిర్దేశం..**

అంతకుముందు జీఎం కార్యాలయంలో గనుల ఏజెంట్లు,ప్రాజెక్టు అధికారులతో డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.గనుల పనితీరు,బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు,ప్రాజెక్టుల పురోగతి,అభివృద్ధి పనులపై చర్చించారు.అనంతరం కేకే ఓసీపీ వ్యూ పాయింట్ నుంచి క్వారీలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

**శ్రావణపల్లి ప్రాజెక్టుపై పరిశీలన..**

భవిష్యత్తు బొగ్గు ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాంతాన్ని, పరిసర గ్రామాలను డైరెక్టర్ పరిశీలించారు.ఈ పర్యటనలో ఎస్‌వోటూజీఎం జి.ఎల్.ప్రసాద్,ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి,కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రాంబాబు,కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్,శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్,డీజీఎం (పర్సనల్)సీహెచ్. అశోక్,డీజీఎం(సివిల్)మదీనా భాష,డీజీఎం(సర్వే) భూక్య దేశాయ్,అటవీశాఖ అధికారి నవీన్,ఏరియా సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి,వర్క్‌షాప్ ఇన్‌చార్జి డీజీఎం నరేష్,ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ,దాగ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ..

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,అక్టోబర్22(సూర్యరేఖ)** ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.4 మెడికల్ ఆఫీసర్,1ఫార్మసిస్ట్,1సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు),1యోగ ప్రొఫెషనల్,3మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/సంస్థ నుంచి ఆయుర్వేదం,యునాని,హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ,ఫార్మా-డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని,సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని,యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి,యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని,మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి,సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు,కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో,ఇతర అవసరమైన పత్రాలు,పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు,అర్హతలు, రిజర్వేషన్లు,ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

## రైతులు దళారును నమ్మి మోసపోవద్దు..

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి



**అందోల్ ప్రతినిధి,అక్టోబర్22(సూర్యరేఖ)** రైతులు పండించిన తమ వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోవద్దు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేందాల్లోనే విక్రయించాలని మార్క్ ఫెడ్ జగన్ మోహన్ రెడ్డి రైతులకు సూచించారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో అందోల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ...దళాలను ఆశ్రయించి మోసపోవద్దు అంటూ కోరారు.దళారులు తూకంలో మోసం చేసే అవకాశాలు ఉన్నాయి అన్నారు.కావున రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సంప్రదించి తమ ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. అమ్మిన ధాన్యానికి రైతులు అమ్మిన ధాన్యానికి 3రోజుల్లోనే డబ్బులు చెల్లించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.కొనుగోలు నిర్వహణ సైతం రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.మార్కెట్ యార్డులో వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆయన మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డాకూరి వెంకటేశం,అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్,మున్సిపల్ కౌన్సిలర్లు పట్లోల్ల రేఖప్రవీణ్,అరుణ్,కోశికే రాజశేఖర్,హరికృష్ణ,తోట్ల రామకృష్ణ,అల్లే శ్రీకాంత్,దుర్గేశ్,అనిల్,కో-ఆప్షన్ మెంబెర్స్ పిట్ల లక్ష్మణ్,జీషాన్ నాయకులు కొత్త శ్రీశైలం,గొహేర్ అలీ రైతులు పాల్గొన్నారు.

## నేడే అలయ్ బలయ్' కార్యక్రమం..

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ ప్రతినిధి,అక్టోబర్22 (సూర్యరేఖ)** దసరా పండుగ సందర్భంగా ఆందోల్ నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయంగా కలుసుకునేందుకు, సోదరభావం,ఐక్యత, సంప్రదాయాలను చాటిచెప్పేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' కార్యక్రమం సుల్తాన్‌పూర్ లోని ఎంఎస్ ఫంక్షన్ హాల్,తాడ్ దాన్ పల్లి ఎక్స్ రోడ్ వద్ద నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఆందోల్ నియోజకవర్గ ప్రజలు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## బీఆర్ఎస్‌లోకి చేరికలు..

చింతలగడ్డతండా నుంచి 35కుటుంబాలు గులాబీ గూటికి..

కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు





**మరిపెడ,అక్టోబర్22(సూర్యరేఖ)** మరిపెడ మండలం చింతలగడ్డ తండాకు చెందిన35 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరాయి.గురువారం మరిపెడ మండలం బీచ్ రాజుపల్లిలోని మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పార్టీ కండువాలు కప్పివారిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గుడిపుడి నవీన్‌రావు పార్టీలో చేరిన కుటుంబాలకు కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# కాటేదాన్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు..

**సబితా ఇంద్రారెడ్డిని సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**

**పార్టీ బలోపేతానికి,డివిజన్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: ఎస్.వెంకటేష్**



**రాజేంద్రనగర్,అక్టోబర్22(సూర్యరేఖ):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దసరా వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ నేతృత్వంలో డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,శాంతి,సమృద్ధిని నింపాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి,వారి సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయడం పార్టీ శ్రేణుల బాధ్యత అని పేర్కొన్నారు.నాయకులు,కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి,కాటేదాన్ డివిజన్ అభివృద్ధికి మరింత ఉత్సాహంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,వారి కృషి,సహకారం పార్టీకి ఎంతో ముఖ్యమని పునరుద్ఘాటించారు.పండుగలు నాయకులు,కార్యకర్తల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు ఐక్యతను చాటుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాళ్లు లక్ష్మీ రాజ్,ప్రసన్న,పద్మ, పుష్ప,భావన,శంకరమ్మ,లత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

**పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన యోధుడు పండుగ సాయన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నాయక్**




**నారాయణపేట,అక్టోబర్ 22 (సూర్యరేఖ):** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బహుజన బంధువు,తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ రాష్ట్ర నాయకుడు,తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగ సాయన్న కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని,పేదలు,బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన పోరాట స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు.సమాజంలో ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడిన ప్రజల పక్షాన నిలిచి అన్యాయాలను ఎదిరించిన ధైర్యశాలి పండుగ సాయన్న అని కొనియాడారు.ఆయన జీవిత చరిత్రను నేటి యువతకు,భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందని,పేదల పట్ల ఆయన చూపిన ఆదరణ,ప్రజల కోసం చేసిన పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన చరిత్ర,సామాజిక సేవలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో పండుగ సాయన్న జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పండుగ సాయన్న చరిత్ర గొప్పదని,ఆయన పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు.కుస్తీ పోటీల్లో పాల్గొంటూ తన ప్రత్యేకతను చాటుకున్న సాయన్న,వివిధ సందర్భాల్లో ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.ప్రజలతో మమేకమై వారి కష్టాలను అర్థం చేసుకుంటూ పేదల కోసం నిలబడిన వ్యక్తిగా ఆయన చరిత్రలో గుర్తింపు పొందారని అన్నారు.ఇలాంటి చారిత్రక వ్యక్తుల జీవితాలను స్మరించుకోవడం,వారి సేవలను భావితరాలకు పరిచయం చేయడం సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు.పండుగ సాయన్న జయంతి వేడుకలు సామాజిక ఐక్యతకు,బహుజన చరిత్ర పరిరక్షణకు దోహదపడాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.మహనీయుల జీవితాలు,పోరాటాలు ,ప్రజాసేవను స్మరించుకుంటూ సమానత్వం,సామాజిక న్యాయం,ఐక్యత వంటి విలువలను సమాజంలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంతోష్ ముదిరాజ్,కాకర్ల భీమయ్య,పోషల్ వినోద్, సంక్లాపూర్ మల్లేష్,కరెంట్ కృష్ణ,పోషల్ రాజేష్,పల్ల రఘు,కావలి మొగుళప్ప,బొడ్డు జల్లప్ప,లక్ష్మీనారాయణ,ఆకుల బలప్ప,సతీష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ లో వ్యవసాయానికే పెద్ద పీట..

**రైతే రాజు**

**ఎల్ నినో నేపథ్యంలో ఆరు తడి పంటలే వేసుకోవాలి..**

**రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు ప్రారంభ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల**



**రాజేంద్రనగర్,అక్టోబర్22(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వ విద్యాలయం మరో వినూత్న కార్యక్రమం అయిన రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గురువారం లాంఛనంగా ప్రారంభించారు.ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులలో విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఖేత్ బచావో అభియాన్ కూడా విస్తృత స్థాయిలో రైతాంగానికి చేరువ కావాలని మంత్రివర్యులు పిలుపు ఇచ్చారు.శాస్త్ర ఫలాలు రైతులకి చేరువ కావడంలో ఇంకా లోటు పాట్లు ఉన్నాయని ఇటువంటి కార్యక్రమాల ద్వారా వాటిని భర్తీ చేయాలన్నారు.యూరియా వాడకాన్ని ఇంకా తగ్గించి భూమి సారాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్ వేర్ నిపుణులు కూడా పల్లెలకొచ్చి వ్యవసాయం చేయడానికి ఆసక్తి కనపరుస్తున్నారని,భవిష్యత్ వ్యవసాయానిదేనని,రైతే రాజు అని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన శక్తికి మించి వ్యవసాయానికి సాయం అందిస్తున్నారని మంత్రి వివరించారు.రైతు రుణమాఫీ,రైతు భరోసా వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు.ప్రస్తుతం ప్రపంచం అంతా ఎల్ నినో సవాలు ఎదుర్కొంటున్నదని దానిని అందరూ సమష్టిగా ఎదుర్కోవాలని మంత్రి పిలుపునిచ్చారు. రానున్న నెలల్లో తాగు నీటి కి సైతం చాలా ఇబ్బంది ఉంటుందన్నారు.ఈ పరిస్థితులలో రైతులు ఆచి తూచి అడుగులు వేసి అవకాశం ఉంటే కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు.గత రెండేళ్లగా ఉపకులపతి అల్దాస్ జానయ్య సారధ్యంలో విశ్వ విద్యాలయం ప్రగతి బాటన పయనిస్తోందని మంత్రి అభినందించారు. బోధన సిబ్బంది నియామాకాలు,పీజీ,పీహెచ్ డీ విద్యార్థుల స్టైఫండ్ పెంపు అంశాలని సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.తన రెండేళ్ల కాలంలో విశ్వ విద్యాలయంలో అమలు చేసిన సంస్కరణల గురించి ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు.సీట్లు పెంపు,ఫీజుల తగ్గింపుతో పాటు కొత్త కళాశాలల ఏర్పాటు,కొత్త కోర్సులని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.వ్యవసాయ కూలీల పిల్లలకి15శాతం సీట్లు కేటాయించామన్నారు.రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం ద్వారా సుమారు 3,20,000మంది రైతులని నేరుగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కలిసారని జానయ్య వివరించారు.పరిశోధనలు, టెక్నాలజీలని రైతులకి మరింత చేరువ చేయడానికి ఈ “రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు” కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జానయ్య వివరించారు.రానున్న రెండేళ్లలో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తామన్నారు.అలాగే విశ్వవిద్యాలయం ర్యాంక్ ని 10లోపు నిలపడానికి కృషి చేస్తామని అల్దాస్ జానయ్య హామీ ఇచ్చారు.విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది నియామాకానికి సత్వరం అనుమతి ఇవ్వవలసిందిగా ఆలాగే పీజీ,పీహెచ్ డీ విద్యార్థుల స్టై ఫండ్ పెంపునకు అంగీకరించ వలసిందిగా జానయ్య మంత్రివర్యులకి విజ్ఞప్తి చేశారు.ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పంటల మార్పిడికి,చిరు ధాన్యాలు,పప్పు దినుసులు,నూనె గింజల సాగుకి ప్రాధాన్యత ఇవ్వాలని ఐకార్ సంస్థల ఉన్నతాధికారులు రైతాంగానికి సూచించారు.ఈ సందర్భంగా రైతు పొలాల్లోకి ఆవిష్కరణల కార్యక్రమం కరపత్రాన్ని,రెండేళ్ల విశ్వవిద్యాలయ ప్రగతి వీడియోని మంత్రివర్యులు విడుదల చేశారు. అదే విధంగా కొందరు రైతులకు పప్పుధాన్యాల విత్తనాలు సంచులని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నార్మ్ సంచాలకులు ఆర్.ఎమ్. సుందరం,ఇక్రిసాట్ శాస్త్రవేత్త హరికిషన్,క్రీడా శాస్త్రవేత్త మారుతి,ఐఐఎమ్ ఆర్ సంచాలకులు తారా సత్యావతి,ఐఐఓఆర్ సంచాలకులు మాథుర్, పిజెటిఏయు రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సిహెచ్ విద్యాసాగర్,ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ ఎస్.కె. రావు,పరిశోధనా సంచాలకులు డాక్టర్ మరాఠి బల్ రామ్,విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు,బోధనా సిబ్బంది,రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాళ్లవాగు బ్రిడ్జి పనులతో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు..

**తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలి..**

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**





**మంచిర్యాల,అక్టోబర్22(సూర్యరేఖ)** రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అధికారులను ఆదేశించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా మట్టి రహదారిని ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ,మున్సిపల్ అధికారులకు సూచించారు .నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు,వాహనదారులకు ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజా సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ నిర్మాణ పనులను చేపట్టాలని,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అభివృద్ధి పనుల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా అర్జీపీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,సంబంధిత అధికారులు,కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్లూరు పట్టణంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి..నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రంజాన్ బి**




**ఖమ్మం,అక్టోబర్22(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని,అత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రంజాన్ వి డిమాండ్ చేశారు.గన్యాతండా కల్లూరు పట్టణ పరిధిలో అంబేద్కర్ నగర్ శాంతినగర్ ప్రాంతాల్లో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ...ఉపాధి హామీ కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని,నిత్యవసర సరుకులు ధరలు పెరిగి పేదల ఇబ్బందులు పడుతున్నారని,పనులు లేకపోవడం వల్ల సామాజిక బతకడం కష్టంగా మారిందని,కూలీలకు వెంటనే ఉపాధిపనులు కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు.రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యవసర సరుకులు ధరలు సబ్సిడీపై అందించాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సుమిత్ర,బానోతు కృష్ణ,క్రాంతి కుమార్, బానోతు రమాదేవి,భానోత్ రంజిత్ కుమార్,బానోతు రాదా,తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలోకి తలారి బాలరాజు.



**కామారెడ్డి,అక్టోబర్22(సూర్యరేఖ)** ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకుడు తలారి బాలరాజ్ త్వరలో జనసేన పార్టీలోకి వెళ్ళనున్నట్లు సమాచారం. జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నట్లు తెలుస్తుంది. తలారి బాలరాజ్. 2018ముందస్తు ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డిపై ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 13000 చీలుకు ఓట్లు వచ్చాయి.తలారి బాలరాజుకు గ్రామ గ్రామాన క్యాడర్ ఉంది.ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల టైంలో గ్రామ గ్రామాన తిరిగి క్యాడర్,ను తయారు చేసుకున్నాడు.తలారి బాలరాజ్ జనసేన పార్టీలోకి వస్తే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని రాజకీయ విశ్లేషలకు అంచనా. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడాల శ్రీనివాసరావు రాకతో చాలామంది విద్యావేత్తలు విద్యాసంస్థ అధినేతలు పార్టీలోకి రావాలని మొగ్గు చూపుతున్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు,సీనియర్ జర్నలిస్ట్ చేరికల బాధ్యత తీసుకొని పార్టీ బలోపేత దిశగా వెళుతున్నట్లు సమాచారం.గడాల శ్రీనివాసరావు రాకతో రాష్ట్రంలో పార్టీ బలోపేతం దిశగా ముందుకు సాగుతోంది.చాలామంది ముఖ్యనేతలు పార్టీలోకి వెళ్తున్నట్లు సమాచారం

## చిన్న శివునూరులో ఫాంపాండ్ పనులను పరిశీలించిన డిఆర్డిఓ శ్రీనివాసరావు



**చేగుంట,అక్టోబర్22(సూర్యరేఖ)** చేగుంట మండలంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇందులో భాగంగా చిన్న శివునూరు గ్రామ పంచాయతీలో భూగర్భజలాల పెంపొందించడం కోసం ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన ఫాం పాండ్ ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా అధికారులు టేపుతో కుంట కొలతలను స్వయంగా కొలిచి,నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. గ్రామాల్లో భూగర్భజలాల మట్టాన్ని గణనీయంగా పెంచడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫాం పాండ్స్ నిర్మాణాన్ని చేపడుతోందని డిఆర్డిఓ తెలిపారు. రైతులు తమ పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా సాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం కింద జరిగే ప్రగతి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని క్షేత్రస్థాయి సిబ్బందిని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామాల్లో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చిన్న శివునూరు గ్రామ సర్పంచ్ సుంచనకోట వరలక్ష్మిస్వామిగౌడ్, గౌరవ ఎంపీడీవో చిన్నారెడ్డి,ఎంపీఓ ప్రకాష్, ఏపీఓ శ్వేత,ఏపిఎం దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్,రైతులు పాల్గొన్నారు

## దామరగిద్దలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి సాయన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి**



**దామరగిద్ద,అక్టోబర్ 22 (సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ముదిరాజ్ మహాసభ దామరగిద్ద శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముదిరాజ్ మహాసభ జిల్లా కన్వీనర్,లింగారెడ్డిపల్లి సర్పంచ్ కావలి మొగులప్ప నేతృత్వంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కావలి మొగులప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రజావీరుడు పండుగ సాయన్న బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు.నిజాం నవాబులను ఎదిరించి పేద ప్రజల పక్షాన నిలిచిన ధీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.సాయన్న ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.మున్కన్‌పల్లి మాజీ సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ ముదిరాజుల పట్ల ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేవలం జయంతి వేడుకల నిర్వహణతో సరిపెట్టకుండా బీసీ వర్గీకరణ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చేందుకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసినప్పుడే ప్రభుత్వం తమకు న్యాయం చేసినట్లవుతుందని అన్నారు.పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప మాట్లాడుతూ పండుగ సాయన్న చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయన జయంతి,వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరమని తెలిపారు.తెలంగాణ ప్రజావీరుడిగా సాయన్న సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ పేదలు,బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు ,ప్రజాప్రతినిధులు, యువకులు,గ్రామస్థులు తదితరులు పాల్గొని పండుగ సాయన్నకు నివాళులర్పించారు.

# మొగలమడకలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి పండుగ సాయన్న ఆశయాలను కొనసాగించాలి: గ్రామ పెద్దలు**

**దామరగిద్ద,అక్టోబర్ 22 (సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మొగలమడక గ్రామంలో ప్రజా వీరుడు,పాలమూరు ముద్దుబిడ్డ పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గత్తప రాములు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.కామారెడ్డి ప్రకటనకు అనుగుణంగా ముదిరాజు బిడ్డలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పండుగ సాయన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముదిరాజులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఉపసర్పంచ్ కురువ అంజిలప్ప,మాజీ ఉపసర్పంచ్ కురువ బుగ్గప్ప మాట్లాడుతూ పండుగ సాయన్న సంపన్నుల నుంచి సంపదను తీసుకుని పేదలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.కులమతాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన న్యాయం అందించేందుకు కృషి చేసిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చడం ద్వారా ఆ వర్గానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.గ్రామ డీలర్ గుత్తా హనుమంతు,కావలి శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగ సాయన్న చేసిన సేవలు ముదిరాజు సమాజం గర్వించదగ్గవని అన్నారు.ఆయన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వం,సామాజిక



న్యాయం కోసం కృషి చేయాలని సూచించారు.పల్లెబండ నర్సింలు మాట్లాడుతూ పండుగ సాయన్న పేదల పక్షాన నిలిచి ప్రజా వీరుడిగా,తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరు పొందారని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కావలి కాశప్ప,దీన్ని గెలి మొగులప్ప,టాప్ కాశప్ప,ధామ్ బండ కాశప్ప,విష్ణువర్ధన్,వెంకటప్ప,బోయిని వెంకటప్ప,చాపల రాములు, దానయ్య గౌడ్,కురువ నారాయణ,వడ్ల శ్రీనివాస్,బీజేపీ నాయకుడు హనుమంతు,బాయికాడ అంజనేయులు,నెంబర్ లక్ష్మప్పతో పాటు ముదిరాజ్ సంఘం సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం..

**కుల సంఘాలు వేరైనా..లక్ష్యం ఒక్కటే కావాలి**

**బీసీల ఓట్లు బీసీలకే..రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలి**

**బీసీ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు**



**మంచిర్యాల,అక్టోబరు22(సూర్యరేఖ)** బీసీలంతా ఐక్యంగా సంఘటితమై రాజకీయంగా ఎదిగినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు అన్నారు.మంచిర్యాలలోని ఎం. కన్వెన్షన్ హాల్‌లో గురువారం బీసీ సమాజ్,బీసీ టైమ్స్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ అలయ్ బలయ్ వేడుకల్లో సంఘం సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ...కుల సంఘాలు వేరైనా బీసీల లక్ష్యం ఒక్కటే కావాలని,హక్కుల సాధన కోసం సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.విభజన రాజకీయాలకు తావివ్వకుండా ఐక్యతతో తమ రాజకీయ బలాన్ని చాటాలని సూచించారు.బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకుండా రాజకీయ చైతన్యంతో పాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.రాబోయే ఎన్నికల్లో తమ హక్కులు, ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

**పూలే ఆశయాలతో హక్కుల సాధన..**

మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బీసీల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యారావు సూచించారు.బీసీ సమాజం ఐక్యంగా ఉంటేనే సమాన అవకాశాలను సాధించడంతోపాటు ఆధిపత్య ధోరణులను సమర్థంగా ఎదుర్కోగలదని పేర్కొన్నారు.ఇతరుల రాజకీయ ప్రయోజనాలకు బలికాకుండా,తమ సామాజిక వర్గ అభివృద్ధి,రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.బీసీల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.వివిధ బీసీ సంఘాల మధ్య సమన్వయం పెంపొందించి, సామాజిక సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు. అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు వివిధ సంఘాల నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

**ఒకే వేదికపై బీసీ సంఘాల నాయకులు..**

దసరా పండుగ అనంతరం సంప్రదాయంగా నిర్వహించే అలయ్ బలయ్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.వివిధ బీసీ సంఘాల నాయకులు, సామాజిక సేవకులు,యువజన నాయకులు పాల్గొని ఐక్యత,హక్కుల సాధన, రాజకీయ భాగస్వామ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.కార్యక్రమాన్ని నిర్వహించిన నరేడ్ల శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ నారగోని,ఓబీసీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ మహిళా ప్రతినిధి దేవి పొట్లూరి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్,బీసీ నాయకుడు కర్రె లచ్చన్న,యాదవ సంఘం అధ్యక్షుడు బండి సదానందం,పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్,పెరిక సంఘం మహిళా అధ్యక్షురాలు అతి సరోజ, మున్నూరు కాపు సంఘం మహిళా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి,మహిళా కార్పొరేటర్ పెట్టం స్వరూప,ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు తోటి శ్రీనివాస్,కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి,మేరా సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం..





**సామా రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి..**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపు**

**శంషాబాద్,అక్టోబర్ 22(సూర్యరేఖ)** రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి,రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,నియోజకవర్గాల ఇన్‌చార్జులు,పార్టీ ముఖ్యనాయకులు,జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా విద్యావంతులు,ఉద్యోగులు కాంగ్రెస్ అభ్యర్థికి తమ మద్దతు తెలపాలని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మండల,డివిజన్ కమిటీలను పూర్తి చేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని,అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఏఐసీసీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి,కసిరెడ్డి నారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి,కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దారాసింగ్ జాదవ్‌తో పాటు పీసీసీ నాయకులు,జిల్లా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు,వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి మండపానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చిననాగచారి-వాణి దంపతులు



**ఖమ్మం,అక్టోబర్22(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో శ్రీవీరబ్రహ్మేంద్రనగర్ కాలనీలో పంచలోహ దుర్గామాత అమ్మవారి ఆధ్వర్యంలో,దసరా మరియు,విజయదశమి, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఆలయ అభివృద్ధికి కాలనీవాసులు, మరియు ఆభగవంతుని నమ్ముకున్న భక్తుల కొంగుబంగారమై దిన దిన అభివృద్ధి చెందుతుంది, ఒక్కసారి ఆలయ దర్శనం చేస్తే వారి కుటుంబాలే మారిపోతున్నాయని,నమ్మకంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈఆలయానికి దర్శనం ఎక్కువగా చేస్తూ ఉంటారు.ఈ ఆలయానికి రెండు రాష్ట్రాల మరియు జిల్లాల స్థాయిలో భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు మరియు ఆలయ అభివృద్ధికి కావాల్సిన పరికరాలు అందిస్తున్నారు,మండల భక్తులు నమ్ముకొని ఆలయ దర్శనం చేస్తే వారు కోరికలు తీర్నాయని అక్కడ జరిగిన కార్యక్రమంలో ఎల్లువెత్తిన నిజాలు,వీరబ్రహ్మేంద్రనగర్ కాలనీవాసులు,అలానే తల్లాడ మండలం రంగంబంజర్ గ్రామానికి చెందిన,పోలోజ్ సాయిల్ కుమారులు,ఆలయ అభివృద్ధికి ఆదేవుని ఇచ్చిన కృపా కటాక్షంతో గ్రామ,మండల,జిల్లా స్థాయికి చేరుకొని ఆలయాన్ని దినదిన అభివృద్ధి చేస్తున్నారు ఆలయాన్ని నమ్ముకున్న కుటుంబాలు,ఆరోజు న్నండి కరోనా రోజుల్లో కూడా ఆ గ్రామంలో ఒక్కరికి కూడా కరోనా వచ్చిన దాఖలాలు దసరా నవరాత్రి సందర్భంగా పోలోజు సాయిలు రెండవ కుమారుడు, నాగచారి,వాణి దంపతులు ఆలయమండప నిర్మాణమునకు,లక్ష రూపాయలు విరాళవిచ్చిరు,ఆ కాలనీలో ప్రతి ఒక్కరు చేతి వృత్తితో జీవనం సాగించేవారు.మండల స్థాయి నియోజవర్గ స్థాయి దాటి జిల్లాస్థాయిలో మన్నన పొందుతున్నారు, కల్లూరు మండలంలో,ఆదర్శకాలనీగా వీరబ్రహ్మేంద్ర నగర్ వాసులు,మండలంలో ఉన్న అన్ని పార్టీలతో అందరి నాయకులతో సమన్వయంగా ఉంటూ అన్ని పార్టీల మన్నన పొందుతున్నరు.

## అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ..

రెండు వర్గాల యువకుల మధ్య వివాదం..
ఊరేగింపులో పోలీసుల లాఠీచార్జి..
యువకులను చెదరగొట్టిన పోలీసులు..
ఇద్దరికి తీవ్ర గాయాలు

**రాజేంద్రనగర్,అక్టోబర్22(సూర్యరేఖ)** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పున్న రాజు,సంకూరి జయప్రకాష్ అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు.పద్మశాలిపురం భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద గత 25ఏళ్లుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.గతంలో కాలనీలోని యువకులంతా కలిసి ఉత్సవాల నిర్వహణ బాధ్యతలు చేపట్టేవారు.అయితే ఇటీవల యువకులు రెండు వర్గాలుగా విడిపోవడంతో ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను పున్న రాజుకు అప్పగించారు.ఈ క్రమంలో బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా రెండు వర్గాల యువకుల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది.ఈ ఘటనలో పున్న రాజు ముఖంపై దాడి జరగడంతో దవడకు తీవ్ర గాయమైంది. మరోవైపు జయప్రకాష్ మణికట్టుకు ఫ్రాక్చర్ అయింది.గాయపడిన ఇద్దరూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.పున్న రాజు హైదర్‌గూడలోని జాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని ఇరువర్గాల యువకులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్వల్పంగా లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.ఈ ఘటనపై ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలలోని 9మంది యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొడంగల్ ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా కొడంగల్లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ :** నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి,స్పీకర్ గడ్డం,లకు దసరా శు భాకాంక్షలు తెలిపిన

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ.సదాలక్ష్మి



**రాజేంద్రనగర్,అక్టోబర్23(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం,ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,లకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమారి అబ్బేశి సదాలక్ష్మి వారి క్యాంపు కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

## వరాసిగూడలో చెత్త తొలగింపునకు జీహెచ్ఎంసీ చర్యలు..




**సికింద్రాబాద్,అక్టోబర్22(సూర్యరేఖ)** వరాసిగూడ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ లేన్‌లో చెత్తాచెదారం, మ్యాన్‌హోళ్ల సమస్యలపై అందిన ఫిర్యాదుల మేరకు జీఎస్ఆర్ బృందం సభ్యుడు సయ్యద్ సద్దాం చొరవ తీసుకున్నారు. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ ఏఈ వినయ్ కుమార్,మేనేజర్ కుశాల్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు.పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు సిబ్బందిని పంపించారు.ఈ చర్యలు బిఆర్ఎస్ యువ ఐకాన్ తీగుళ్ల రామేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు సద్దాంభాయ్ తెలిపారు.

## కోకాపేటలో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించిన జలమండలి ఎండీ

శుద్ధి చేసిన నీటి నాణ్యత పరీక్షలు,ఫలితాలపై సమీక్ష..
పీసీబీ,జలమండలి సమన్వయంతో నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ..
పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రధాన కార్యాలయానికి అనుసంధానించాలి..
ట్యాంకర్లలో నీటి పరిమాణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు..
అదనపు నీరు వృథా కాకుండా తిరిగి మళ్లించే వ్యవస్థ ఏర్పాటు చేయాలి..
నీటి నాణ్యత,సరఫరా పరిమాణంపై నిరంతర పర్యవేక్షణ:
జలమండలి ఎండీ కె.అశోక్ రెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్22 (సూర్యరేఖ)** నగరంలో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు శుద్ధి చేసిన నీటిని తాగునీరు యేతర అవసరాలకు వినియోగించేలా జలమండలి చర్యలు చేపడుతోంది.ఇందులో భాగంగా కోకాపేటలోని గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్ రెడ్డి గురువారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఫిల్లింగ్ స్టేషన్‌లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించిన ఎండీ.పరీక్షల నిర్వహణ,వివిధ నాణ్యతా ప్రమాణాలు,ఫలితాల నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ),జలమండలి సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత ప్రమాణాల ప్రకారం క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు వాటిని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించేలా అనుసంధానించాలని సూచించారు.ఇందుకోసం జలమండలి ఐటీ విభాగంతో సమన్వయం చేసుకుని అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.నీటి నాణ్యతకు సంబంధించిన రికార్డులు పారదర్శకంగా,ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే ట్యాంకర్లలో నింపే నీటి పరిమాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వివిధ సామర్థ్యాల ట్యాంకర్లకు అనుగుణంగా వేర్వేరు ఫిల్లింగ్ పరిమితులను నిర్దేశించి,ప్రతి ట్యాంకర్‌లో నింపిన నీటి పరిమాణంతో పాటు ఫిల్లింగ్ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్ణీత పరిమాణానికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని,అదనంగా వచ్చే నీరు వృథా కాకుండా తిరిగి సంబంధిత చెరువులోకి మళ్లించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.ఇందుకు అవసరమైన సాంకేతిక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.శుద్ధి చేసిన నీటిని భవన నిర్మాణ రంగం,పారిశ్రామిక అవసరాలకు,రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ,ఉద్యానవనాల నిర్వహణ తదితర తాగునీరు అవసరం లేని పనులకు వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ల నిర్వహణలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం,భద్రతా ప్రమాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీపీ సీజీఎం పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆపన్నుడికి అండగా చిలకలగూడ పోలీసులు.. నిరాశ్రయుడిని ఆశ్రమానికి తరలింపు



**సికింద్రాబాద్,అక్టోబర్22(సూర్యరేఖ)** రోడ్డుపై నిస్సహాయ స్థితిలో ఉన్న ఓవ్యక్తికి చిలకలగూడ పోలీసులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.గురువారం పద్మారావునగర్‌లోని ఎస్పీ కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న సుమారు 45ఏళ్ల సాగర్ కుమార్ గుప్తా గురించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా,ఆ వ్యక్తి తన కుటుంబ వివరాలు,చిరునామా వెల్లడించలేకపోయాడు.దీంతో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ సిబ్బంది అతడిని యాప్రాల్‌లోని 'సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్' ఆశ్రమానికి సురక్షితంగా తరలించారు.ఆపదలో ఉన్నవారికి,నిరాశ్రయులకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని సీఐ తెలిపారు. పోలీసుల మానవతా దృక్పథంపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## రాష్ట్ర ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి..

బిఆర్ఎస్ నాయకులు మంద జగన్



**సికింద్రాబాద్,అక్టోబర్22(సూర్యరేఖ)** బౌద్ధనగర్ డివిజన్‌లో శ్రీనల్లపోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్,సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు,ఎస్సి,ఎస్టి,బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అమ్మవారి ఊరేగింపు సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంతో పాల్గొని,ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లుగా గొల్ల శీను,కే.రాజు,బి.శ్రీశైలం నిర్వహించారు.ఈ వేడుకల్లో పి.వెంకటేష్,శేఖర్, వినయ్ కుమార్,బ్రహ్మచారి,చింతకింది మల్లేష్,ఒగ్గు శ్రీధర్,కొండలన్న, ఆనంద్ కుమార్,తౌటం సతీష్, పులి శివకుమార్,సన్నీ,సామల శివకుమార్, సామల రాజు, ఆమంచ వెంకటేష్,వైట్ల రాము,తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారు.

జనసేన నాయకుడు ఎల్లమ్మల భాస్కర్.



**ఎల్లారెడ్డి,అక్టోబర్22(సూర్యరేఖ)** రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జనసేన పార్టీ లింగంపేట నాయకులు ఎల్లమ్మల భాస్కర్ అన్నారు.సామాజిక న్యాయం జనసేన పార్టీతోనే సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. నిరంతరం ప్రజల కోసం ఆలోచించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆయన గుర్తు చేశారు.కామారెడ్డి జిల్లాలో జనసేన పార్టీ బలంగా ఉందని,రానున్న రోజుల్లో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఎల్లమ్మల భాస్కర్ అన్నారు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి ప్రజలకు చేరువై పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.పొత్తు ధర్మంలో భాగంగా ఎన్డీఏతో కలిసి ముందుకు వెళ్దామని భాస్కర్ అన్నారు.10 సంవత్సరాల భారత రాష్ట్ర సమితి పరిపాలనలో అప్పులు తప్ప అభివృద్ధి చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలో వెళ్తుందని ఆయన విమర్శించారు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ భారత రాష్ట్ర సమితి పార్టీలను ప్రజలు తరిమికొడతారని ఆయన అన్నారు.2028 ఎన్నికల్లో బిజెపితో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భాస్కర్ తెలిపారు.జనసేన పార్టీ రాష్ట్ర నాయకత్వం శంకర్ గౌడ్,గడాల శ్రీనివాసరావు,రాధా రాజలింగం, బొంగులూరి మహేందర్ రెడ్డి,మచ్చ సుధాకర్, మీసాల శ్రీనివాసరావు,దాసరి పవన్,ఎన్.మల్లేష్, మల్లికార్జున్,లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వనిత రెడ్డికి శు భాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు



**రాజేంద్రనగర్,అక్టోబర్22 (సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మేకల వనితారెడ్డికి బిజెపి హైదర్ గూడ డివిజన్ బిజెపి నాయకులు శు భాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఉప్పరపల్లిలోని వనితరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయను శాలువాతో సత్కరించారు.వనితరెడ్డిని సన్మానించిన వారిలో డివిజన్ బిజెపి నాయకులు పసుపుల సందీప్ ముదిరాజ్,మల్లేష్ చారి,వెంకటేష్, సుధాకర్ రెడ్డి,మైనార్టీ నాయకులు పాషా,తదితరులు ఉన్నారు.

# కాసుల కక్కుర్తితో చిన్నారుల భవిష్యత్తు బలి..






**మాసాయిపేట,అక్టోబర్22(సూర్యరేఖ)**ంశ్రీవెంకటేశ్వర వైన్స్ అక్రమాలపై ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తిన తీరు.. నిబంధనలు తుంగలో తొక్కి మైనర్లకు మద్యం విక్రయాలు.. మామూళ్ల మత్తులో జోగుతున్నారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం.. డబ్బు సంపాదనే పరమావధిగా భావిస్తున్న కొందరు మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను నడిరోడ్డుపై బలిపీఠం ఎక్కిస్తున్నారు.చట్టప్రకారం మైనర్లకు మద్యం విక్రయించడం తీవ్ర నేరమైనప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆచట్టాలు మాసాయిపేటలో ఉన్న శ్రీవెంకటేశ్వర వైన్స్ యాజమాన్యానికి ఏమాత్రం వర్తించడం లేదు.పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వయసున్న పసిపిల్లలకు సైతం యథేచ్ఛగా మద్యం సీసాలు అందజేస్తూ వారి జీవితాలను వ్యసనాల ఊబిలోకి నెడుతున్నారు. కళ్లముందే పసిమొగ్గల విధ్వంసం..ఓప్రత్యక్ష ఉదాహరణ మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి సమీపంలో నిర్వహిస్తున్న ఈవైన్స్ దుకాణం వద్ద ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో విస్మయపరిచే దృశ్యాలు చోటుచేసుకుంటున్నాయి.గత మంగళవారం సాయంత్రం మైనర్ బాలుడు నేరుగా కౌంటర్ వద్దకు వచ్చి మద్యం అడగ్గా,కనీస విచక్షణ చూపని సిబ్బంది నగదు తీసుకుని వెంటనే మద్యం సీసాలు చేతిలో పెట్టారు.ఈ దారుణాన్ని గమనించిన తోటి బాటసారులు వారిని ప్రశ్నించగా,తమకు వ్యాపారమే ముఖ్యమని,కొనేవారి వయసుతో తమకు పనిలేదంటూ సిబ్బంది దురుసుగా బదులివ్వడం అక్కడున్న వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది.

**నిద్రమత్తులో ఎక్సైజ్ యంత్రాంగం..కనుచూపుమేర కానరాని తనిఖీలు..**

మండల కేంద్రంలో ఇంతటి బరితెగింపు సాగుతున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు కనుచూపుమేరలో కూడా కనిపించకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు వైన్స్ దుకాణం వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీగా మామూళ్ల పర్వం నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.నెలవారీ ముడుపుల మత్తులో జోగుతున్న అధికారులు తనిఖీలను గాలికొదిలేయడం వల్లే వ్యాపారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని స్థానిక ప్రజలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.

**ఆందోళనలో తల్లిదండ్రులు..**

ఆగ్రహంతో రగులుతున్న స్థానికులు చేతికి అందివచ్చి ఇంటికి ఆసరాగా నిలవాల్సిన పిల్లలు ఈ వయసులోనే మద్యం బారిన పడుతుండటం చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.కష్టపడి సంపాదించిన డబ్బుతో పిల్లలను చదివిస్తుంటే, కొందరు స్వార్థపరులు కాసుల కక్కుర్తితో వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని కన్నవారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చిన్నపిల్లలకు మద్యం అమ్మే దుర్మార్గులపై,వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై సమాజం తిరగబడకముందే చర్యలు తీసుకోవాలని ఆవేదనతో హెచ్చరిస్తున్నారు.

**తక్షణమే లైసెన్స్ రద్దు చేయాలి..**
**ఉన్నతాధికారుల జోక్యానికి మండల ప్రజల డిమాండ్**

శ్రీవెంకటేశ్వర వైన్స్ నిర్వాహకులపై నామమాత్రపు జరిమానాలతో సరిపెట్టకుండా వెంటనే దుకాణం లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో పత్రికా ముఖంగా డిమాండ్ చేస్తున్నారు.చిన్నారుల భవిష్యత్తును నాశనం చేస్తున్న లైసెన్స్ దారుణిపై, యాజమాన్యంపై చట్టపరంగా కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు,విధులను విస్మరించిన ఎక్సైజ్ అధికారులపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామ రామమోహన్‌రెడ్డి ఎంపిక యువతకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి





**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ పిలుపు**

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 22 (సూర్యరేఖ):** రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యువకుడు,ఉత్సాహవంతుడు,పార్టీకి విధేయుడైన సామ రామమోహన్‌రెడ్డిని అధిష్ఠానం ఖరారు చేయడం యువత,పట్టభద్రుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.శంషాబాద్ పరిధిలోని మల్లిక గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎంపీ మల్లు రవి,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,నియోజకవర్గాల ఇన్‌చార్జులు,వివిధ చైర్మన్లు,జిల్లా అధ్యక్షులు,నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చదువుకున్న యువతకు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించే దిశగా ఆలోచించి సామ రామమోహన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం అభినందనీయమన్నారు. రాజకీయాలపై పూర్తి అవగాహన కలిగి,కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరించిన రామమోహన్‌రెడ్డికి చట్టసభల్లో పట్టభద్రుల తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం సంతోషకరమని పేర్కొన్నారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికలకు దిశానిర్దేశం చేసేలా ఉండాలని,అందుకోసం ప్రతి నాయకుడు,కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి పట్టభద్ర ఓటరూ తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.నవంబర్ 6 ఓటరు నమోదు ప్రక్రియకు చివరి తేదీ కావడంతో పట్టభద్రుల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు.పార్టీ శ్రేణులు తమ పరిసరాల్లోని పట్టభద్రులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదుకు సహకరించాలని,కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటన

**సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారం.. స్పందించిన యాజమాన్యం**

**సికింద్రాబాద్.** సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటనపై స్పందించిన యాజమాన్యం, తప్పుడు ప్రచారంపై సమగ్ర విచారణకు డీజీపీని కోరనున్నట్లు వెల్లడించింది. హాస్పటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ యువ రోగి మృతి పట్ల విషాదం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోగి వచ్చినప్పటి పరిస్థితితో పాటు చికిత్స విధానం గురించి చెబుతూ వైద్యులు అవసరమైన చికిత్సలు మాత్రమే అందచేయడం జరిగిందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని వేదికల్లో వాస్తవాలకు విరుద్ధమైన సమాచారం ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రజలకు సరైన వివరాలు తెలియాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోగి బయటి డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేయించుకున్న సీటీ స్కాన్‌తో ఆసుపత్రికి వచ్చారని, ఆ నివేదికలో సుమారు 16, 17, 20 మిల్లీమీటర్ల పరిమాణంలో కిడ్నీ రాయి ఉన్నట్లు, అది మూత్ర ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో మూత్రపిండంలో వాపు ఏర్పడినట్లు వెల్లడైందని ఆ పరిమాణంలో ఉన్న రాయిని తొలగించడానికి శస్త్ర చికిత్స తప్పనిసరి అని అందుకే శస్త్ర చికిత్స చేసి తొలగించడం జరిగిందని చెప్పారు. కానీ 1ఎంఎం, 2ఎంఎం అని రాయి అని సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేసారని అన్నారు. కొంతమంది వ్యక్తులు మెడికవర్ హాస్పిటల్ కు ఒక రాజకీయ పార్టీ నేతకు సంబంధం అంతకడుతూ తమ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నం చేసారని వారిపైన చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు పరువు నష్టం దావా కూడా వేయనున్నట్లు వెల్లడించారు.

## చాకేపల్లిలో భూముల రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి,అక్టోబర్22(సూర్యరేఖ)** భూముల రీసర్వే,భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండలంలోని చాకేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...భూ రికార్డుల ప్రక్షాళన,సర్వే పనుల్లో పారదర్శకత తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత సమయంలో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్నతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ తహసీల్దార్, ఆర్ఐ రమేష్,ఇతర రెవెన్యూ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే నాయకుడికి ప్రజల ఆదరణే అసలైన గెలుపు.!

**బతుకమ్మ సంబరాలకు ప్రత్యేక ఏర్పాట్లు..**
**ప్రజల మనసులు గెలిచిన సర్పంచ్ పేరం శ్రీనివాస్.!**





**జన్నారం,అక్టోబర్22(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ పేరం శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అక్కచెల్లెళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలంకరణలు, అవసరమైన సదుపాయాలు కల్పించి,ఊరంతా ఒకే చోట బతుకమ్మ ఆడేలా చర్యలు తీసుకున్నారు.కామన్‌పల్లి గ్రామంలో ఒకే కుటుంబం నుంచి వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికై హ్యాట్రిక్ సాధించడం విశేషం.ఆయన మంచితనం,ప్రజలకు అందించే సహాయ సహకారాలు,ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే గుణమే తమ అభిమానానికి, ఆయన విజయానికి ప్రధాన కారణమని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

## దేవనకొండ వైసిపి ఎంపీపీ అభ్యర్థిగా కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు నామినేషన్..

**ఘనంగా సత్కరించిన పార్టీ శ్రేణులు**

**దేవనకొండ:** దేవనకొండ మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు.?నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు దివాకర్ నాయుడికి అభినందనలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.?ఈ సందర్భంగా దివాకర్ నాయుడు మాట్లాడుతూ.. దేవనకొండ మండలంలో వైఎస్సార్‌సీపీకి, తమ కుటుంబానికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని, ప్రజల ఆదరణతో ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ నాయకుల సహకారంతో మండల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కిట్టు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

**-కట్టమూరి సుబ్బారావు**

అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే పేషెంట్ జబ్బు వల్ల కాకుండా మందుల బిల్లుకు భయపడే పరిస్థితి పోవాలంటే జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని వారధి ట్రస్ట్ చైర్మన్ కట్టమూరి సుబ్బారావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్టీ రవీంద్ర విక్రమ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రాసే మందుల చీటీలోని కార్పొరేట్ మందుల కంటే అత్యంత తక్కువ ధరలో అవే రకమైన మందులను అందించే జనరిక్ ఔషధాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

బిజినెస్

# రాగి.. బంగారమాయెనే!

## టెస్లా, స్పేస్‌ఎక్స్ మెగా విలీనం



న్యూయార్క్, అక్టోబర్ 22: ప్రపంచంలో అతిపెద్ద విలీనానికి ముహూర్తం ఖరారైంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, స్పేస్ ఎక్స్ రెండు సంస్థలు విలీనం కాబోతున్నాయి. ఈ రెండు సంస్థలు విలీనమైన తర్వాత ఏర్పడే కొత్త సంస్థ నికర విలువ 3.5 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఈ రెండు కంపెనీలు చిప్ సెట్లు, ఏఐ, ఇతర సాంకేతిక ప్రాజెక్టులను పనిచేస్తున్నాయి. విలీనం తర్వాత మస్క్ సంపద మరో 110 బిలియన్ డాలర్లు మేర పెరుగనున్నది. ప్రస్తుతం టెస్లా..ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తుండగా, స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్లు, డాటా సెంటర్లు, శాటిలైట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

## జీఎస్టీలో సంస్కరణలు..
## నవంబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు.. వీరికి లబ్ధి



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సంస్కరణలు నవంబర్ 1 నుంచి అమలు కానున్నాయి. దీనిలో భాగంగా కీలక మార్పులకు కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని జీఎస్టీ కౌన్సిల్ సిద్ధమైంది. ముఖ్యంగా చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరేలా ఈ సంస్కరణలు ఉండనున్నాయి. నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్న కొన్ని కీలక జీఎస్టీ సంస్కరణలు ఇవి. చిరు వ్యాపారులు తమ జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభంగా చేయవచ్చు. ఈ కామర్స్ ప్లాట్‌ఫాంల ద్వారా వ్యాపారులు, వాణిజ్య సంస్థలు తమ సంస్థల్ని సులభంగా రిజిష్టర్ చేసుకోవచ్చు. అనేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న చిన్న సంస్థలు సులభంగా రిజిష్టర్ చేసుకునే వీలుంది. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్ వర్క్ కూడా సులభంగా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కావాల్సిన డాక్యుమెంట్ల వివరాల్ని కూడా ఈజీగా పొందే వీలుంది. జీఎస్టీ రీఫండ్ కూడా త్వరగా పూర్తవుతుంది. సంబంధిత డాక్యుమెంట్లు సమర్పిస్తే అర్హులైన వారికి జీఎస్టీ రీఫండ్ ప్రక్రియ వెంటనే పూర్తవుతుంది. ఈ విషయంలో ఏ అధికారి సాయం అవసరం లేదు. జీఎస్టీకి సంబంధించి షోకాజ్ నోటీసులు జారీ చేసేందుకు కనీస పరిమితిని రూ.10,000గా నిర్ణయించారు. అనవసర, ఫిర్యాదులు, నిర్వహణ వ్యయాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది జీఎస్టీ కౌన్సిల్. అక్టోబర్ 8న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 57వ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ట్యాక్స్ చెల్లింపుల ప్రక్రియ సులభంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగేందుకు తాజా నిర్ణయాల్ని అమలు చేయనున్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల్లో వ్యాపారం చేయాలనుకునేవారికి ఇంతకుముందు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కష్టతరంగా ఉండేది. ఇప్పుడు సులభంగా చేసింది.

### 2025-26లో భారీగా పెరిగిన వినియోగం
### 2,100 కిలో టన్నులకు చేరిక
### ఇన్‌ఫ్రా, ఆటో, నిర్మాణ రంగాల్లో డిమాండ్



**న్యూఢిల్లీ:** దేశీయంగా ఆటోమోటివ్, నిర్మాణ, మౌలిక తదితర రంగాల్లో రాగికి భారీ డిమాండ్ నెలకొంది. దీనితో 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో వినియోగం 12 శాతం పెరిగి 2,100 కిలోటన్నులకు (కేటీ) చేరింది. ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా (ఐసీఏ ఇండియా) విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం వైర్లు, కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లతో పాటు ఎలక్ట్రికల్, పారిశ్రామిక రంగాల్లో ఉపయోగించే ఉత్పత్తుల తయారీకి కీలకంగా ఉండే రాగికి 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో డిమాండ్ 1,878 కేటీగా నమోదైంది. 'రాగికి డిమాండ్ నెలకొనడమనేది దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు వేగవంతమవుతున్న తీరును ప్రతిబింబిస్తుంది. మౌలిక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేలా సానుకూల పాలసీలు, పారిశ్రామికీకరణ, స్వచ్ఛ ఇంధనాలవైపు మళ్లుతుండటం మొదలైన అంశాల వల్ల రాగికి డిమాండ్ మరింతగా పెరుగుతుంది' అని ఐసీఏ ఇండియా ఎండీ మయూర్ కర్మార్కర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాగి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 1959లో ఏర్పాటైన లాభాపేక్షరహిత అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ భారత విభాగంగా ఐసీఏ ఇండియా పని చేస్తోంది. కాపర్ అలయన్స్‌లో సభ్యత్వం కూడా ఉంది.

**మౌలికం దన్ను..**

గత ఆర్థిక సంవత్సరంలో అదనపు డిమాండ్‌కి మౌలిక రంగం ప్రధాన చోదకంగా నిల్చినట్లు ఐసీఏ ఇండియా తెలిపింది. మొత్తం కాపర్ వినియోగంలో 22 శాతం వాటా ఉండే ఈ రంగంలో డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 29% మేర పెరిగినట్లు వివరించింది. ఇక 2025 ఆర్థిక సంవత్సరంలో నెమ్మదించిన ఆటోమోటివ్ పరిశ్రమ కూడా పుంజుకుంది. ప్యాసింజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాల వృద్ధి దన్నుతో ఈ విభాగంలో రాగి వినియోగం 14% పెరిగింది. డిమాండ్‌లో నాలుగో వంతు వాటా ఉండే నిర్మాణ రంగంలో వినియోగం తొమ్మిది శాతం వృద్ధి చెందింది. ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులు, కమర్షియల్ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, పట్టణీకరణలాంటి అంశాల కారణంగా బిల్డింగ్ వైర్లు, పవర్ కేబుల్స్ మొదలైన వాటికి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్న డేటా సెంటర్ల వాటా మొత్తం డిమాండ్‌లో 1% కన్నా తక్కువే ఉంది.

# కొత్త కార్లకు ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ తప్పనిసరి



**న్యూఢిల్లీ:** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా కేంద్ర రోడ్ల రవాణా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2030 అక్టోబరు నుంచి కొత్త కార్ల మోడళ్లలో అధునాతన అత్యవసర బ్రేకింగ్ వ్యవస్థ (ఏఈబీఎస్)ను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. ఇప్పటికే ఉన్న పాత కార్ల మోడళ్లకు 2032 అక్టోబరు నుంచి ఈ నిబంధనను అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అక్టోబరు 19, 2026న ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్ (ఏఐఎస్--185)కు అనుగుణంగా ఈ వ్యవస్థ ఉండాలని ముసాయిదాలో పేర్కొన్నారు. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజాభిప్రాయాలను స్వీకరించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో డ్రైవర్ స్పందించకపోతే 'ఏఈబీఎస్' ఆటోమేటిక్‌గా బ్రేకులు వేస్తుంది. తద్వారా ప్రమాదాన్ని నివారించడం లేదా ఢీకొన్నప్పుడు దాని ప్రమాద తీవ్రతను తగ్గించడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాల్లో ఈ వ్యవస్థను అమర్చడం తప్పనిసరి కానుంది. మధ్య తరహా, భారీ వాణిజ్య వాహనాల భద్రతను పెంచేందుకు బ్రేకింగ్ వ్యవస్థలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను ప్రతిపాదించింది. ట్రక్కుల్లో బ్రేకుల పనితీరును మెరుగుపరిచేందుకు సవరించిన బ్రేకింగ్ ప్రమాణాలను 2027 అక్టోబరు 1 నుంచి తప్పనిసరి చేయనుంది. అదే తేదీ నుంచి ట్రక్కులకు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) వ్యవస్థను కూడా అమలు చేయనున్నారు. ఏఐఎస్--162 ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఈ వ్యవస్థ, ముఖ్యంగా మలుపుల్లో బ్రేకులు వేసినప్పుడు వాహన స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# కివీస్‌తో తొలి టీ20 మ్యాచ్..
# ఇండియాను గెలిపించిన నమన్ ధీర్, సంజూ శాంసన్




**క్రైస్ట్‌చర్చ్:** నమన్ ధీర్ స్టన్నింగ్ బ్యాటింగ్ చేశాడు. కేవలం 15 బంతుల్లోనే అతను 42 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 5 బౌండరీలు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 280 స్ట్రయిక్ రేట్‌తో అతను బ్యాటింగ్ చేశాడు. దీంతో కివీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్(భీజ×చీణ)లో.. టీమిండియా 4 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. 226 రన్స్ భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే విక్టరీ ఖాతాలో వేసుకుని అయిదు మ్యాచ్‌లో సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధించింది. భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆరంభంలో ఊచకోత కోశారు. ఆ ఇద్దరూ తొలి వికెట్‌కు 93 రన్స్ జోడించారు. పవర్‌ప్లేలో సంజూ, అభిషేక్ .. బౌండరీలతో హోరెత్తించారు. అభిషేక్ 12 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 రన్స్ చేశాడు. ఇక శాంసన్ 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 రన్స్ చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. అతను 28 బంతుల్లో 42 రన్స్ స్కోరు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్ ఇద్దరూ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. అల్లెన్ 24 బంతుల్లో 45, ఫిలిప్స్ 40 బంతుల్లో 82 రన్స్ చేశారు. టీ20ల్లో స్వదేశీ పిచ్‌పై కివీస్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. దాదాపు నాలుగేళ్లు ఇంటర్నేషనల్ క్రికెట్ దూరంగా ఉన్న భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్‌లో ఆడాడు. అయితే భువీ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. అతని ఖాతాలో వికెట్ పడలేదు. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ 17 బంతుల్లో 24 రన్స్ చేశాడు. న్యూజిలాండ్ చివరి 30 బంతుల్లో 67 రన్స్ చేసింది. అర్షదీప్, అక్షర్, మయాంక్ యాదవ్‌లు చెరో ఒక వికెట్ తీసుకున్నారు.

## శ్రీలంక సంచలన విజయం.. 430 టార్గెట్ హాంఫట్



ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా రావాల్పిండి వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో శ్రీలంక సంచలన విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 430 పరుగుల భారీ లక్ష్యాన్ని శ్రీలంక చేధించి చరిత్ర సృష్టించింది. వన్డే క్రికెట్ హిస్టరీలోనే ఇది రెండో అత్యధిక విజయవంత రన్ చేజ్ కావడం విశేషం. అయితే శ్రీలంకకు మాత్రం ఇదే హైయిస్ట్ ఛేజింగ్.

**చెలరేగిన లంక బ్యాటర్లు**

భారీ లక్ష్య చేధనలో ఆరంభంలోనే శ్రీలంకకు భారీ షాక్ తగిలింది. ఓపెనర్ కమిందు మెండిస్(18)తో పాటు కెప్టెన్ కుశాల్ మెండిస్(0) వరుస క్రమంలో పెవిలియన్‌కు చేరారు. ఈ సమయంలో మరో ఓపెనర్ అవిష్కా ఫెర్నాండో(97), యువ ఆటగాడు పవన్ రత్నాయకే(106 బంతుల్లో 130) ప్రత్యర్థి బౌలర్లపై ఎదురు దాడికి దిగారు. అవిష్కా ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ దాసున్ షనకా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 50 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 97 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. పవన్, శనక ఔటయ్యాక జట్టును నడిపించే బాధ్యతను జనిత్ లియానగే(27 బంతుల్లో 61) తీసుకున్నాడు. అయితే జోష్ టంగ్ వేసిన చివరి ఓవర్‌లో లంక విజయానికి కేవలం 8 పరుగులు మాత్రమే అవసరమయ్యాయి. దీంతో శ్రీలంక ఈజీగా విజయం సాధిస్తుందని అంతా భావించారు. తొలి బంతికి లియానగే సింగిల్ తీసి దునిత్ వెల్లలాగేకు స్ట్రైక్ ఇచ్చాడు. అయితే వరుసగా శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయింది. దీంతో ఒక్కసారిగా మ్యాచ్ ఇంగ్లండ్ వైపు మలుపు తిరిగింది. క్రీజులోకి వచ్చిన అషితా ఫెర్నాండ్ సింగిల్ తీసి లియానగేకు స్ట్రైక్ ఇచ్చాడు. చివరి రెండు బంతుల్లో లంక విజయానికి 6 పరుగులు అవసరమవ్వగా.. లియానగే భారీ సిక్సర్ బాది జట్టుకు చారిత్రత్మక విజయాన్ని అందించాడు.

**బ్రూక్ డబుల్ సెంచరీ**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుతమైన డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఓవరాల్‌గా 116 బంతులు ఎదుర్కొన్న బ్రూక్.. 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 202 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు విల్ జాక్స్(66), జో రూట్(69), టామ్ బాంటన్(50) హాఫ్ సెంచరీలతో రాణించారు. అయినప్పటికి ఇంగ్లండ్ ఓడిపోవడంతో బ్రూక్ ద్విశతకం వృథా అయిపోయింది.

స్పోర్ట్స్

## ఆస్ట్రేలియాను చిత్తు చేసిన సౌతాఫ్రికా



సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ అండ్ 31 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఘనవిజయం సాధించింది. దీంతో మూడు టెస్టు సిరీస్‌ను 1-1తో ప్రోటీస్ సమం చేసింది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌ను 425/9 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా (179) వీరోచిత సెంచరీతో కదం తొక్కాడు. అతడితో పాటు మార్కో జాన్సెన్ కూడా 85 పరుగులతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో స్కాట్ బోలాండ్ 5 వికెట్లతో సత్తాచాటాడు.

**కుప్పకూలిన ఆసీస్**

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను సఫారీ బౌలర్లు దెబ్బతీశారు. మార్కో జాన్సెన్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆసీస్ కేవలం 99 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్(ఫాలో ఆన్)లో కూడా ఆసీస్ బ్యాటర్ల తీరు మారలేదు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (121) సెంచరీతో సత్తాచాటినప్పటికి, ఇతర బ్యాటర్ల నుంచి తగిన సహకారం లభించలేదు. స్కాట్ బోలాండ్(40), అలెక్స్ కారీ(37) కాస్త ఫర్వాలేదన్పించారు. ఫలితంగా ఆసీస్ ఫాలో ఆన్‌లో 295 పరుగులు చేసి ఇన్నింగ్స్ తేడాతో ఓటమి పాలైంది. సెకెండ్ ఇన్నింగ్స్‌లో సఫారీ పేసర్లు కాగిసో రబాడా నాలుగు, వియాన్ ముల్డర్ మూడు వికెట్లతో చెలరేగారు. ఇరు జట్ల మధ్య సిరీస్ డిసైడర్ మూడో టెస్ట్ అక్టోబర్ 27 నుంచి కేప్‌టౌన్ వేదికగా ప్రారంభం కానుంది.



# సిల్వర్ జూబ్లీ దిశగా...

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సిల్వర్ జూబ్లీ దిశగా ప్రయాణం కొనసాగిస్తున్నారు హీరో ప్రభాస్. 'ఈశ్వర్' (2002) సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ 24 ఏళ్లుగా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఆయన నటించిన తొలి చిత్రం 'ఈశ్వర్' 2002 నవంబరు 11న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ లెక్కన నవంబరులో తన కెరీర్‌లో 25 ఏళ్ల మైల్‌స్టోన్‌లోకి (సిల్వర్ జూబ్లీ) అడుగుపెడుతున్న ప్రభాస్... వరుస భారీ పాన్ ఇండియా మూవీస్‌తో బిజీ బిజీగా దూసుకెళుతుండటం విశేషం. పాన్ ఇండియా స్టార్‌డమ్ దాటేసి, గ్లోబల్ స్థాయిలో ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ప్రభాస్ పుట్టినరోజు నేడు (అక్టోబరు 23). 'బాహుబలి' (2015) సినిమాతో మొదలైన ప్రభాస్ పాన్ ఇండియా జర్నీ దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రభాస్ సినిమాలు బాలీవుడ్ స్టార్స్‌తో పోటీ పడేంతగా ఉత్తరాదిలోనూ వసూళ్లు సాధిస్తున్నాయి. 'బాహుబలి 2, కల్కి 2898 ఏడీ' సినిమాలతో రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రెండు సార్లు సాధించిన ఏకైక స్టార్ ప్రభాస్. ఓవర్‌సీస్ మార్కెట్‌లో పది మిలియన్లకు పైగా వసూళ్లను సాధించిన తొలి హీరోగా రికార్డ్ సాధించారు. ఇక కెరీర్‌లో 25 ఏళ్ల మైల్‌స్టోన్‌ని టచ్ చేయనున్న ప్రభాస్ హీరోగా దూసుకెళుతున్నారు. ఇందుకు నిదర్శనం ఈ హీరో డైరీలో ప్రస్తుతం నాలుగు సినిమాలు ఉండటమే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లో 'కల్కి 2', ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్ 2' వంటి భారీ సినిమాలతో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉన్నారు.

# స్త్రీల రాజ్యమేలుతున్న పెన్నూరు గడ్డపై పవర్ వార్.. కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్ అదుర్స్!



ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన క్రైమ్ డ్రామా సిరీస్ 'అక్క' ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ (=ఖీ జుత్‌వత్ఖుఱఅఎవత్) నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు. పూర్తిగా మహిళల చేతుల్లో సాగే ఒక విభిన్న రాజ్యాన్ని, వారి మధ్య జరిగే పవర్ పాలిటిక్స్‌ను ఈ సిరీస్‌లో ఆవిష్కరించనున్నారు. అక్టోబర్ 30 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ చూస్తుంటే.. పెన్నూరు అనే కల్పిత రాజ్యంలో గత 800 ఏళ్లుగా కేవలం మహిళలదే పూర్తి ఆధిపత్యం. ఇక్కడ కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ మహిళల కంట్రోల్‌లోనే ఉంటాయి. కుటుంబంలో అత్యున్నత అధికారం చెలాయించే మహిళను 'అక్క' అని పిలుస్తారు. ప్రేమకు, పెళ్లికి సంబంధించి ఈ సమాజం కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను పాటిస్తుంది. అయితే, రుద్ర (రాధికా ఆప్టే) రాకతో ఈ వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. రుద్ర అంచనాలు, ఆమె ఆశయాలు భవాని (కీర్తి సురేష్)తో తీవ్ర ఘర్షణకు దారితీస్తాయి. ఈ ఇద్దరు బలమైన మహిళల మధ్య జరిగే ఆధిపత్య పోరు, వంశాచారాన్ని కాపాడుకునే ప్రయత్నం వంటి అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తన్వి అజ్మి, మహేష్ మంజ్రేకర్, అన్షుమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్, వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రైమ్ డ్రామా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 321' కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం



బ్రహ్మ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద శాంతి కుమార్ చిలుముల, రామానుజ రెడ్డి వంగపాటి నిర్మాణంలో శాంతి కుమార్ చిలుముల తెరకెక్కించిన చిత్రం '321'. ఉప శీర్షిక లవ్ మ్యారేజ్ వర్సెస్ అరెంజ్డ్. ఈ సినిమాలో మోహిత్, లావణ్య జంటగా నటించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 23న విడుదల చేయబోతోన్నారు.. ఈ క్రమంలో బుధవారం నాడు చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం చిత్రయూనిట్ మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో.. దర్శక, నిర్మాత శాంతి కుమార్ మాట్లాడుతూ .. 'నాకు ఈ జర్నీలో తోడుగా నిలిచిన మోహన్ గారు, మయూర్ పట్నాల, మర్రి రాజశేఖర్ రెడ్డి గారికి థాంక్స్. ఐటీ అనేది నా ప్రొఫెషన్, ఆర్ట్స్ అనేది నా ప్యాషన్. ఈ చిత్రంలోని ఆర్టిస్టులంతా కూడా అద్భుతంగా నటించారు. మాధవి గారి సహకారం ఎప్పటికీ మర్చిపోలేం. ఆమె ఇచ్చిన రిఫరెన్సులతోనే ఎంతో మంది ఆర్టిస్టుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. కాల్విన్ జాయ్ మ్యూజిక్ బాగా వచ్చింది. మౌన శ్రీ గారు పాటలు రాయడమే కాకుండా ఈ సినిమాలో మంచి పాత్రను పోషించారు. మా సినిమా అద్భుతంగా వచ్చింది. కుటుంబ సమేతంగా చూసేలా మా చిత్రం ఉంటుంది. అక్టోబర్ 23న మా మూవీ రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నిర్మాత రామానుజ రెడ్డి మాట్లాడుతూ .. "నేను ఇండస్ట్రీలో చాలా మంది వద్ద అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాను. శాంతి కుమార్ గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ మూవీతోనే నేను నిర్మాతగా పరిచయం కాబోతోన్నాను. ఈ సినిమా బాగుంటుంది. ఈ చిత్రాన్ని కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

పబ్లిసిటీ డిజైనర్ వివా రెడ్డి మాట్లాడుతూ .. "321' టైటిల్, ఆ డిజైనింగ్‌లోనే కథ అంతా ఉంది. మూడు ముళ్లు, ఇద్దరు మనుషులు, ఒక జీవితం అని అర్థం వచ్చేలా డిజైన్ చేశాం. బ్రహ్మ ఆర్ట్ క్రియేషన్ లోగోని శాంతి కుమార్ గారు దగ్గరుండి డిజైన్ చేయించుకున్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన శాంతి కుమార్ గారికి థాంక్స్' అని అన్నారు.




# ఘనంగా డీఆర్ఆర్ ప్రొడక్షన్స్ తొలి చిత్రం ప్రారంభం

హైదరాబాద్: డీఆర్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న తొలి చిత్రం 'ప్రొడక్షన్ నంబర్ 1' దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ దామోదర్ నేరేళ్ల తన డ్రీమ్ ప్రాజెక్టుగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శశాంక్ దువ్వూరు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవి శివతేజ,భాస్కర్ పరమాత్ముని, సుబ్రహ్మణ్యం అల ప్రధాన పాత్ర ల్లో నటిస్తుండగా, నేహా పఠాన్ కథానాయికగా కనిపించనున్నారు. స్నేహం, ప్రేమ, కుటుంబ అనుబంధాలతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలను మేళవిస్తూ విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది.

**డ్రీమ్ ప్రాజెక్టుగా సినిమా నిర్మాణం**

ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఐఏఎంఏ) వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ దామోదర్ నేరేళ్ల వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్నారు. గత 26 ఏళ్లుగా యూకే, అమెరికాలో వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఆయనకు సినిమాలపై చిన్నప్పటి నుంచే ప్రత్యేక ఆసక్తి ఉంది. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. తన సినిమా ప్రయాణం గురించి నిర్మాత డాక్టర్ దామోదర్ నేరేళ్ల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సినిమాలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఖైదీ' సినిమా చూడటానికి పాఠశాలకు వెళ్లకుండా వరంగల్ వెళ్లిన రోజులు కూడా ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఇన్నాళ్లుగా తనలో ఉన్న సినిమా కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నానని, తన డ్రీమ్ ప్రాజెక్టు దసరా రోజున ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. దర్శకుడు శశాంక్ దువ్వూరు చెప్పిన కథ తనకు ఎంతగానో నచ్చిందని, ప్రేమ, స్నేహం, కుటుంబ విలువలతో పాటు మంచి సందేశాన్ని అందించే అంశాలు ఇందులో ఉన్నాయని వివరించారు. దర్శకుడిగా శశాంక్‌కు ఇది తొలి చిత్రమైనప్పటికీ, ఆయన ప్రతిభపై, కథపై పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

**వినోదంతో పాటు బలమైన కాన్సెప్ట్**

దర్శకుడు శశాంక్ దువ్వూరు మాట్లాడుతూ.. గతంలో రష్మిక మందన్న నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని తెలిపారు. 'ఉల్టా' అనే షార్ట్‌ఫిలింను కూడా రూపొందించినట్లు వెల్లడించారు. ఇప్పుడు దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. పైకి లైట్‌హార్టెడ్ ఎంటర్‌టైనర్‌లా కనిపించినప్పటికీ, ఈ సినిమాలో బలమైన కాన్సెప్ట్ ఉంటుందని చెప్పారు. ముగ్గురు యువకుల చుట్టూ తిరిగే కథలో వినోదంతో పాటు విభిన్నమైన అంశాలను ఆసక్తికరంగా ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713